

అద్దెలు చెల్లించని మూడు షాపులు సీజ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలులో నగరపాలక సంస్థ పరిధిలోని పార్క్‌రోడ్, బంగి అనంతయ్య కాంప్లెక్స్, పాతబస్తీ లో ఉన్న మున్సిపల్ కార్పొరేషన్ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉన్న మూడు షాపుల యజమానులు అద్దెలు చెల్లించనందున సీజ్ చేసినట్లు ఆర్ఒ జునీద్ గురువారం తెలిపారు. ఒక్కో షాపు లక్షకు పైగా బాకీలు ఉన్నందున ఆయా ప్రాంతాల్లో షాపుల అద్దెలు చెల్లించని పాతబస్తీలోని రవి కాఫీ డిపో, ఉమేష్ పెయింటింగ్ షాప్, పార్క్ రోడ్డులోని షాప్ నెంబర్ 17లను కమిషనర్ ఆదేశాల మేరకు సీజ్ చేసినట్లు తెలిపారు. వారికి మొదటి నెల అద్దెలు చెల్లించమని తెలపడం, రెండో నెల నోటీసులు ఇవ్వడం, మూడోనెల సీజ్ చేస్తున్నామని తెలిపారు. షాపుల యజమానులు ఏ నెలకు ఆ నెల అద్దెలు చెల్లించి, వారి వ్యాపార అభివద్ధికి, కార్పొరేషన్ అభివృద్ధికి పాటుపడాలన్నారు. అద్దెలు చెల్లించ నందున షాపులు సీజ్ చేశామని, ఆభాసుపాలు కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అద్దెలు చెల్లించే వారిపై ఉందన్నారు. ఈ ప్రక్రియ రెగ్యులర్‌గా కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు సాదిక్ ,మన్సూర్, వాజిద్ ,శ్రీకాంత్, రాజు, సుహేల్ ,ఖలీలుల్ రహిమాన్‌లు పాల్గొన్నారు.



షాపులను సీజ్ చేస్తున్న అధికారులు

విత్తన దోపిడీ...

- ఆర్‌బికెలకు చేరని పత్తి విత్తనాలు
- కొరత సృష్టించి సొమ్ము చేసుకుంటున్న డీలర్లు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

దోపిడీకి కాదేదీ అనర్హం అన్నట్లుగా పత్తి విత్తనాల పేరుతోనూ దోపిడీ కొనసాగుతోంది. ఆర్‌బికెల ద్వారా పత్తి విత్తనాలు పంపిణీ చేస్తామని ప్రభుత్వం చెప్పినా ఇప్పటి వరకూ ఆర్‌బికెలకు విత్తన ప్యాకెట్లు చేరకపోవడంతో డీలర్లు కొరత సృష్టించి సొమ్ము చేసుకుంటున్నారు...

గత రెండేళ్లుగా పత్తి నకిలీ విత్తనాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారు. కొన్ని రకాల పత్తి విత్తనాలు అధిక దిగుబడి రావడంతో ఆ రకాలకు డిమాండ్ పెరిగింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ ఖరీఫ్‌లో 7 లక్షల ఎకరాల్లో పత్తి సాగయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. కర్నూలు జిల్లాలో 12.50 లక్షల విత్తన ప్యాకెట్లు, నంద్యాల జిల్లాకు 7.50 లక్షల విత్తన ప్యాకెట్లు మొత్తం కలిపి 20 లక్షల విత్తన ప్యాకెట్లు అవసరం ఉంది. యుఎస్, వేద, సదానంద, ఆద్య, అఖిర, నూజివీడు, కావేరి మణిమేకర్ తదితర రకాల పత్తి విత్తనాలను రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని వ్యవసాయ శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఇప్పటి వరకూ ఒక్క ప్యాకెట్ కూడా ఆర్‌బికెలకు చేరలేదు. దీంతో విత్తన డీలర్ల దగ్గర చెప్పిన రేటుకే రైతులు కొనాల్సి వస్తోంది. గతేడాది ఖరీఫ్‌లో యూఎస్7067 రకం విత్తనాలకు అధిక దిగుబడి రావడంతో ఆ రకం వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. జిల్లాకు 60 వేల ప్యాకెట్ల విత్తనాలు వచ్చాయి. వివిధ ప్రాంతాల్లో డీలర్లు వాటిని అధిక ధరలకు బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఒక రకం పత్తి విత్తనాలు కొనాలంటే మరో రకం విత్తనాలు కూడా కొనాలని దుకణాల యజమానులు చెబుతున్నారు. చాలా ప్రాంతాల్లో వ్యవసాయ శాఖ అధికారులు దుకాణాల వద్ద ఉంటే తప్ప ఎంఆర్‌పి ధరకు విక్రయించడం లేదు. దీంతో రైతులపై విత్తనాల భారం పడుతోంది. యుఎస్ 7067 బిటి పత్తి విత్తన ప్యాకెట్లు బ్లాక్ మార్కెట్‌లో జోరుగా విక్రయిస్తున్నారు. కర్నూలు, కోడుమూరు ప్రాంతాల్లో డీలర్లు కృత్రిక కొరత సృష్టించి అసలు ధర కంటే అధికంగా అమ్ముతున్నారు. ఆ విత్తనాల ప్యాకెట్ అసలు ధర రూ.853 ఉండగా రూ.1150 నుంచి రూ.1200 వరకూ విక్రయిస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో నకిలీ విత్తనాల విక్రయాలు సాగుతున్నా, ఆ దందా రూ.కోట్లల్లో నడుస్తున్నా విత్తన కంపెనీలు, డిస్ట్రిబ్యూటర్లు, డీలర్లపై చర్యలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. బ్లాక్ మార్కెట్‌ను అరికట్టడంలో వ్యవసాయ శాఖ అధికారులు పూర్తిగా విఫలం కావడంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



గతేడాది నకిలీ విత్తనాల వల్ల కాయలు లేని పత్తి పంట (ఫైల్)

ఆర్‌బికెల ద్వారా నాణ్యమైన విత్తనాలు అందించాలి



రెండేళ్ల నుంచి వరుసగా నకిలీ విత్తనాల వల్ల పత్తి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఆర్‌బికెల ద్వారా విత్తనాలు ఇస్తామని చెబుతున్నా ప్రభుత్వం ఆ రకంగా చర్యలు చేపట్టడం లేదు. ప్రభుత్వమే ఆర్‌బికెల ద్వారా నాణ్యమైన పత్తి విత్తనాలను అందించాలి. ప్రాసెస్ చేసిన విత్తనాలు మాత్రమే విక్రయించేలా అనుమతులు ఇవ్వాలి.

- జి.రామకృష్ణ, రైతు సంఘం కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి.

ఎంపి అవినాష్‌రెడ్డి విషయంలో పోలీసు వైఖరి అనుమానాస్పదం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

వివేకానంద రెడ్డి హత్య కేసులో ముద్దాయిగా ఉన్న ఎంపీ అవినాష్ రెడ్డి కర్నూలులో ఉన్నాడని తెలిసిన వెంటనే సిబిఐ అధికారులు ఆయనను అరెస్ట్ చేయడానికి వచ్చిన సందర్భంగా వైసిపి కార్యకర్తలు హంగామా చేస్తున్నా, జర్నలిస్టులపైన దాడి చేస్తున్నా ఏమాత్రం పట్టీపట్టనట్టు పోలీసు యంత్రాంగం వ్యవహరించడం ప్రజల్లో అనుమానాలకు తావిస్తుందని సిపిఎం జిల్లా కమిటీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ పత్రికా ప్రకటన విడుదల చేస్తూ గత మూడు రోజుల నుండి కర్నూలు గాయత్రి ఎస్టేట్‌లో వైసిపి కార్యకర్తల హంగామా చూస్తుంటే ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఒక కేసులో ముద్దాయిగా ఉన్న వ్యక్తికి చట్టపరమైన చర్యలు తీసుకునే అధికారం సిబిఐ అధికారులకు ఉన్నప్పటికీ దాన్ని జరగకుండా హంగామా చేసే ప్రయత్నం వైసిపి కార్యకర్తలు చేయడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందని విమర్శించారు. సిబిఐ అధికారులు చట్టపరంగా తమకున్న అధికారాలను వినియోగించుకుని అరెస్టు చేయడానికి వస్తే హంగామా చేయడం అడ్డుకోవడం దేనికని ప్రశ్నించారు. అక్కడికి న్యూస్ కవరేజ్ కోసం వెళ్ళిన మీడియా ప్రతినిధులపై దాడి చేయడం సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ప్రజా సమస్యల కోసం ఐదు నిమిషాలు రాస్తారోకో చేస్తే ఆగమేఘాల మీద వచ్చి ఆందోళనను చదరగొట్టే పోలీస్ యంత్రాంగం వైసిపి కార్యకర్తల విషయంలో ఎందుకు మౌనంగా ఉన్నారని గౌస్‌దేశాయి ప్రశ్నించాడు. సిబిఐ అధికారులు కూడా దోబూచులాడడం చూస్తుంటే ప్రజల్లో మరింత అనుమానాలు కలుగుతున్నాయన్నారు. ఇప్పటికైనా కర్నూలు నగరంలో శాంతి భద్రతలను కాపాడాల్సిన బాధ్యత జిల్లా, రాష్ట్ర పోలీసు యంత్రాంగంపై ఉందని ఆ రకమైన చర్యలు చేపట్టాలని కోరారు. పోలీస్ యంత్రాంగం హంతకులకే అండగా నిలుస్తుందని భావించాల్సి వస్తుందన్నారు. జర్నలిస్టు పైన దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు.



అధికారులతో మాట్లాడుతున్న జెసి మౌర్య

సిఎం సభా ప్రాంగణం పరిశీలన

ప్రజాశక్తి-పత్తికొండ

ఈ నెల 30న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి పత్తికొండలో రైతు భరోసా కార్యక్రమాన్ని ప్రారంభించడానికి వస్తున్న సందర్భంగా సభాప్రాంగణ ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య పరిశీలించారు. సెయింట్ జోసెఫ్ స్కూల్ గ్రౌండ్‌లో బహిరంగ సభ, ప్రభుత్వ జూనియర్ కళాశాల హెలిప్యాడ్, ఏర్పాట్ల పనులను జిల్లా జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య గురువారం పరిశీలించారు. వారి వెంట ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ , పత్తికొండ ఆర్‌డిఒ మోహన్ దాస్, విష్ణు ప్రసాద్ ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కార్మిక హక్కుల పరిరక్షణకు పోరాటం

- వేర్‌హౌస్ హమాలీ కార్మికుల సమావేశంలో గౌస్ దేశాయి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ విధానాల నుంచి దేశాన్ని రక్షించుకుందామని, కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు డి.గౌస్ దేశాయి, సిఐటియు నగర అధ్యక్షులు ఆర్.నరసింహులు కార్మికులకు సూచించారు. గురువారం కర్నూలు వేర్‌హౌస్ సిఐటియు హమాలీ కార్మికుల జనరల్ బాడీ సమావేశం వేర్ హౌస్ హమాలికార్మికుల యూనియన్ అధ్యక్షుడు విజయుడు అధ్యక్షతన నిర్వహించారు. గౌస్‌దేశాయి, నరసింహులు కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ భారతదేశంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాతభారతరాజ్యాంగంలోని పౌరుల హక్కులను హరించడమే పనిగా పెట్టుకుందన్నారు. మత విద్వేషాలను రెచ్చగొడుతూ అన్నదమ్ముల వలె ఐక్యంగా ఉన్న ప్రజలను విచ్ఛిన్నం చేయాలని చూస్తుందని విమర్శించారు. భారతదేశం అన్ని కులాలు , మతాలు కలిసి ఉండేలాగా భారత రాజ్యాంగాన్ని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నిర్మిస్తే, రాజ్యాంగాన్ని మార్చాలనే దురుద్దేశంతో బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ కలిసి కుట్ర చేస్తున్నాయన్నాయి. భారతదేశ పౌరులుగా, కార్మిక,కర్షకులు, ఉద్యోగులుఅందరు కలిసి బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ కుట్రలను అర్థం చేసుకొని పోరాటానికి సిద్ధం కావాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు. భారతదేశ లౌకిక తత్వాన్ని కాపాడడం కోసం, కార్మిక హక్కుల పరిరక్షణ కోసం, దేశ సంపద పరాయి పాలకుల పాలు కాకుండా కాపాడు కోవడానికి, ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి,పరిపాలనను అంతంమొందించడానికి కార్మిక వర్గం పోరాటానికి సిద్ధంకావాలన్నారు. ఈనెల 30న సిఐటియు ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వేర్ హౌస్ అమాలి యూనియన్ సెక్రటరీ ఆర్.ఓబులేసు, ట్రెజరర్ మల్లికార్జున, ఎల్లప్ప, రమేష్, హుస్సేన్ బాషా పాల్గొన్నారు.



హమాలీలతో మాట్లాడుతున్న గౌస్‌దేశాయి

పత్తికొండలో రోడ్డు విస్తరణకు మహర్దశ

- 30 అడుగుల నుంచి 70 అడుగుల విస్తరణ పనులు
- 2.6 కిలోమీటర్లకు రూ. 29.5 కోట్ల నిధులు మంజూరు
- ఎమ్మెల్యేకు ప్రజల అభినందనలు

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండ పట్టణంలో ఎన్నో ఏళ్లగా రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని గత పాలకులను పట్టణ ప్రజలు ప్రభుత్వానికి ఎంత మొరపెట్టుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదు.పత్తికొండలో 2019 వైసిపి ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ప్రజలను నన్ను గెలిపిస్తే రోడ్డు విస్తరణ పనులు చేపడతానని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పత్తికొండలో రోడ్డు విస్తరణ పనులు శ్రీకారం చుట్టడంతో ప్రజలు వాహనదారులు నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పత్తికొండ రెవిన్యూ డివిజన్ ఏర్పాటు చేయడంతో పత్తికొండకు ఆస్పరి,చిప్పగిరి, ఆలూరు, దేవనకొండ, మద్దికేర, తుగ్గలి, క్రిష్ణగిరి వెల్దుర్తి మండలాల నుంచి ప్రభుత్వ కార్యాలయానికి కార్యకలాపాల కోసం ప్రజలు వేల సంఖ్యలో వస్తూపోతూ ఉంటారు. పత్తికొండ పట్టణంలో 2.6 కిలోమీటర్లు అంబేద్కర్ సర్కిల్ నుంచి గుత్తి సర్కిల్ నుంచి చక్రాల రోడ్డు వరకు ప్రయాణికులు వాహనదారులు రాకపోకలకు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ట్రాఫిక్ సమస్యతో పోలీసులు ప్రభుత్వ యంత్రాంగం సతమతమయ్యేవారు. గత సంవత్సరం ఆర్‌టిసి బస్సు స్కూటర్ ఎదురెదురుగా ఢీకొని ఒక విద్యార్థి మరణించిన సంఘటన, వాహనదారులు ఒకరికొకరు ఢీకొని ప్రమాదాలు జరిగిన వికలాంగులు సంఘటనలు పత్తికొండలో చోటుచేసుకున్నాయి. పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ప్రత్యేక చొరవ తీసుకొని పత్తికొండలో రోడ్డు విస్తరణ పనులు కోసం ప్రత్యేక జీవో154 తీసుకుని వచ్చి రూ.29.5 కోట్ల నిధులను మంజూరు చేయించారు. అంబేద్కర్ సర్కిల్ నుంచి గుత్తి సర్కిల్ వరకు 55 అడుగులు, గుత్తి సర్కిల్లో 70 అడుగులతో సర్కిళ్లను ఏర్పాటు చేయనున్నారు. గుత్తి సర్కిల్ నుంచి చక్రాల రోడ్డు వరకు 55 అడుగులు విస్తరణ పనులు ,భూ సేకరణ కోసం రూ.17 కోట్లు, రోడ్డు మరమ్మతుల కోసం రూ.12.5కోట్ల నిధులతో శ్రీకారం చుట్టారు. విస్తరణ పనులు చురుగ్గా సాగడంతో ప్రజానీకం ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.



రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్న అధికారులు

విస్తరణతో మారునున్న రోడ్డు రూపురేఖలు

- సిపిఎం మండల కార్యదర్శి రంగారెడ్డి



పత్తికొండ పట్టణంలోని 2.6 కిలోమీటర్ల వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టడంతో రోడ్డు రూపురేఖలు మారనున్నాయి. ప్రయాణికులు వాహనదారులు రాకపోకలు సాగించడానికి సజావుగా ఉంటుంది.

ఎమ్మెల్యే చొరవతోనే అభివద్ధి

- పత్తికొండ ఎంపిటిసి నీలకంఠ



పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పట్టణ అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకొని అనేక పనులు చేస్తున్నారు. పట్టణ లో సిసి రోడ్లు, డ్రెయినేజీలు, వాటర్ ట్యాంకులు, తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రజలకు అందుబాటులో ఉంటూ పట్టణ అభివృద్ధికి కృషి చేస్తున్నారు.

ఇక ప్రమాదాలకు తావులేదు

- డ్రైవర్ కోయిలకొండ రాజు



పట్టణంలోని రోడ్డు విస్తరణ చేపట్టడంతో వాహనదారులకు ప్రజలకు ఇబ్బందులు తలెత్తవు. ప్రమాదాలు జరగడానికి ఆస్కారం ఉండదు..

చరిత్రలో మరువలేనివి

- లక్ష్మన్న, కుమ్మర వీధి,పత్తికొండ



ఎన్నో ఏళ్లుగా రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని రాజకీయ నాయకులను ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా చేయలేదు. రోడ్డు విస్తరణ పనులు చేపట్టడంతో ఎమ్మెల్యే శ్రీదేవి చరిత్రలో నిలిచిపోతారు.



టిడిపితోనే ప్రజలకు ఉజ్వల భవిష్యత్తు

టిడిపి కర్నూలు ఇన్చార్జి టిజి భరత్

ప్రజాశక్తి కర్నూలు హాస్పిటల్

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే ప్రజలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కర్నూలు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి టిజి భరత్ అన్నారు. నగరంలోని 47వ వార్డులో ఆయన ఇంటింటి పర్యటన చేపట్టి ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను కలిసిశారు. పారిశుధ్య, తాగునీటి , విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని మొరపెట్టుకున్నారు. పనులు లేక చాలా ఇబ్బందులు పడుతున్నామని పలువురు గౌండాలు టిజి భరత్ దృష్టికి తీసుకువచ్చారు. టిజి.భరత్ మాట్లాడుతూ ఏ వార్డుకు వెళ్లినా ప్రజలు సమస్యలతోనే ఇబ్బందులు పడుతున్నట్లు తెలిసిందన్నారు. కనీస సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రజల వద్దకు వచ్చి మాట్లాడితేనే ఇబ్బందులు తెలుస్తాయన్నారు. పనులు లేక గౌండాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని..టిడిపి ప్రభుత్వం వస్తే గౌండలకు ప్రతిరోజు పని ఉండేటట్లుగా చేస్తామన్నారు. అధికారులు ఇప్పటికైనా ఈ సమస్యలపై దృష్టి పెట్టాలని అన్నారు. దోమలు పెరిగి అంటువ్యాధులు వస్తున్నాయని దీని ద్వారా ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారని ఇప్పటికైనా పారిశుధ్య సమస్యను పరిష్కరించాలన్నారు. తనను ఎమ్మెల్యేగా గెలిపించి కర్నూలు అభివృద్ధి చేసుకోవాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు సురేంద్ర, కిరణ్, జయన్న, పరశురాముడు, మన్సూర్ ఆలీఖాన్, రవి, వినోద్ చౌదరి, శ్రీధర్, శివ, యూనుస్ పాల్గొన్నారు.

తెలంగాణ ఎంసెట్‌లో నారాయణ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

తెలంగాణ ఎంసెట్ (అగ్రికల్చర్ , ఇంజనీరింగ్) – 2023 పరీక్ష ఫలితాల్లో మరోసారి నారాయణ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని కర్నూలు నారాయణ విద్యాసంస్థల కోర్ డీన్ పి. లింగేశ్వరరెడ్డి తెలిపారు.

అగ్రికల్చర్ విభాగంలో : ఐ.కరోలినా ఎవెలిన్ 86 ర్యాంకు,కె. సాయి ముఖేష్ 137 ర్యాంకు, పి. పంకజాక్షి 271 ర్యాంకు, వై.ప్రవల్లిక 273 ర్యాంకు, వై. దినేష్ 310 , డి. సాహితి 326, జె. దినేష్ రెడ్డి 366 , సి. శబరీష్ 456 , ఎస్. సిద్దార్థ 510 , సి.జి. వంశీ 511 , ఆర్. కోవిద రెడ్డి 513, ఎ. నవ్య రెడ్డి, 538 బి. విక్లేషా 560 , వి. మధుసూధన్ 575 ర్యాంకులు వచ్చాయి. 100 లోపు 1,500 లోపు 8 మంది చొప్పున, 1000 లోపు 30 మంది, 2000 లోపు 61 మంది, 3000 లోపు 77 మంది, 5000 లోపు 112 మందికి ర్యాంకులు వచ్చాయి.

ఇంజనీరింగ్ విభాగంలో: జె.పవన్ కుమార్ రెడ్డి 856 ర్యాంకు, కె. విజయ తేజస్విని 1074 ర్యాంకు, ఇ. హరిణి 1234, బి.విశ్వనాథ్ 1255 , ఆర్. నిహారిక 1341, ఎ. అనుగ్య 1362 , బి.జె. మనోజ్ కుమార్ 1571 ర్యాంకు, కె.సాయి శ్రేష్ట 1599, ఎ.వెంకట సాయి శ్రీసాహితీ 1703, బి. రిషిందర్ సింగ్ 1772 ర్యాంకులు వచ్చాయి. 2000 లోపు 10 మంది, 5000 లోపు 38 మంది, 10,000 లోపు 79 మందికి వచ్చాయి. ఇలా చాలా ర్యాంకులను కైవసం చేసుకోడంలో నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు మరోసారి విజయకేతనాన్ని చాటారు. ఈ సందర్భంగా కర్నూలు నారాయణ విద్యా సంస్థల కోర్ డీన్ పి. లింగేశ్వరరెడ్డి విద్యార్థిని విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్లు, ప్రిన్సిపల్స్, అధ్యాపకులు , విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులతో కోర్ డీన్ పి.లింగేశ్వర్‌రెడ్డి

సీఎం పర్యటనను విజయవంతం చేయండి : ఎమ్మెల్యే శ్రీదేవి

ప్రజాశక్తి-పత్తికొండ : పత్తికొండ పట్టణంలో ఈ నెల 30న రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పేర్కొన్నారు. గురువారం వైసిపి కార్యాలయంలో మండల కన్వీనర్ నాగరాజ్ అధ్యక్షతన నాయకులు, సచివాలయ కన్వీనర్లు గ్రామ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెల 30న పత్తికొండ పట్టణాల్లో సెయింట్ జోసెఫ్ గ్రౌండులో జరగబోయే రైతు భరోసా కార్యక్రమాన్ని సీఎం బటన్ నొక్కి ప్రారంభిస్తారన్నారు. వైసిపి అధికారం చేపట్టి నాలుగేళ్ల పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టడం ఎంతో సంతోషకరమన్నారు. ఎంపిపి నారాయణదాసు, మాజీ ఎంపిపి నాగరత్నమ్మ, వైసిపి అధికార ప్రతినిధి శ్రీరంగడు, సచివాలయ కన్వీనర్ మోహన కృష్ణ, ఎస్‌టి సెల్ అధ్యక్షులు భాస్కర్ నాయక్ , మాజీ సర్పంచి సోమశేఖర్, వైసిపి నాయకులు బాబుల్ రెడ్డి పాల్గొన్నారు.





వాలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కాటసారి రాంభూపాల్‌రెడ్డి

వాలంటీర్లకు సన్మానం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : పాణ్యం నియోజకవర్గం కల్లూరు మండలం ఉలిందకొండ, కొంగణపాడు, నాయకల్లు, తడకనపల్లె, చిన్న టేకూరు, పెద్ద టేకూరు, బస్తిపాడు, బొల్లవరం గ్రామాలలోని వాలంటీర్లకు సేవారత్న అవార్డులు, ప్రశంసా పత్రాలు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అందజేశారు. వాలంటీర్లకు సేవా వందనం 2023 సమావేశం ఉలిందకొండ గ్రామంలో నిర్వహించారు. ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా సేవలందించిన వాలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న,సేవా మిత్ర పురస్కారాలు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. వైసిపి నాయకులు ఉలిందకొండ కెవి.రమణారెడ్డి, ఎవి.రమణ, శ్రీనివాసులు, కాశీ విశ్వనాథ్, శీనయ్య, నాగేష్, కర్నూలు జిల్లా కెడిసిసి బ్యాంక్ డైరెక్టర్ కల్లా వెంకట రమణారెడ్డి, కల్లూరు సింగిల్ విండో ప్రెసిడెంట్ శివశంకరరెడ్డి, కార్పొరేటర్ దండు లక్ష్మీకాంత్ రెడ్డి, సల్కాపురం సర్పంచి మద్దిలేటి, పెద్ద టేకూరు హనుమంతు రెడ్డి, రేమడూరు నారాయణ రెడ్డి, పుసులూరు రామకృష్ణారెడ్డి, చిన్న టేకూరు ఈశ్వరయ్య, ఎంపిటిసి నాయకల్లు చంద్రారెడ్డి, మునిస్వామి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



పని తీరులో మెలకువలు పాటించాలి: ఎంపిపి

ప్రజాశక్తి-సి బెళగల్

సచివాలయ ఉద్యోగుల పని తీరులో మెలకువలు పాటించాలని ఎంపిడిఒ రాముడు పేర్కొన్నారు. గురువారం బ్రాహ్మణదొడ్డిలో సచివాలయం తనిఖీ చేసి సిబ్బంది హాజరు, అర్జీల నమోదు రికార్డులను పరిశీలించారు. ఇక్కడే ప్రతి రోజు సాయంత్రం 3 గంటనుంచి నుండి 5 గంటల వరకు స్వీరించే వినతులపై ఆరా తీశారు. పని తీరులో బాధ్యతగా మెలిగి సమస్యలు పరిష్కరించాలని సూచించారు.

బాధ్యతలు స్వీకరించిన వైద్యాధికారి కల్పన

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రిలో గైనకాలజిస్ట్ వైద్యాధికారిగా డాక్టర్ కల్పన గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గర్భిణీలకు బాలింతలకు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని ఆమె తెలిపారు.



గడియారం హాస్పిటల్ సమస్యలు పరిష్కరించాలి

ఖాళీపోస్టులు భర్తి చేసి మౌలిక సదుపాయాలు కల్పించాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు నగరంలోని పాత బస్తీలోని గడియారం హాస్పిటల్‌లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి, మౌలిక వసతులు కల్పించాలని సిపిఎం నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్,నగర కార్యదర్శి వర్గ సభ్యులు మొహమ్మద్ షరీఫ్ డిమాండ్ చేశారు.కర్నూలులో ఎంతో పేరు ప్రఖ్యాతలు చెందిన, ఎంతో ఘన చరిత్ర కలిగిన గడియారం ఆసుపత్రి ఈరోజు బోసిబోయి ఉందని, దీనికి కారణం పాలకులేనని దుయ్యబట్టారు. కర్నూలు నగరంలోని జనాభా సగానికి పైగా ఇక్కడే పుట్టారంటే అతిశయోక్తి కాదు. దాదాపు 100 సంవత్సరాలకు పైబడి ఈ ఆసుపత్రికి చరిత్ర ఉందని, గతంలో చుట్టుపక్కల గ్రామాల వారు,బండ్లు కట్టుకొని వచ్చి ఇక్కడే డెలివరీ చేసుకునే సంఘటనలు అనేకం ఉన్నాయని తెలిపారు. ఈ గడియారం ఆసుపత్రి కాన్పులకు ప్రత్యేకంగా పేరుగాంచిందని, అటువంటి పేరుగాంచిన ఈ హాస్పిటల్‌లో కాన్పుల డాక్టర్ లేకపోవడం చాలా బాధాకరమన్నారు. నాలుగు ఎఎన్ఎంఎస్ పోస్టులకు గాను ఒక్కరే ఉన్నారన్నారు. గడపగడపకు వెళుతున్న ఎమ్మెల్యే ఎం.ఏ.హాఫీజ్ ఖాన్‌కు కూత వేటు దూరంలో ఉన్న గడియారం హాస్పిటల్ సమస్యలు పట్టవా అని ప్రశ్నించారు. ముగ్గురు ఎమ్మెల్యేలు నగర కార్పొరేషన్ పరిధిలో ఉన్నప్పటికీ గడియారం హాస్పిటల్‌కు గైనిక్ డాక్టర్ లేకపోవడం, ఎఎన్ఎంలు, ఆయాలు లేకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా వైసిపి ప్రజా ప్రతినిధులు ప్రభుత్వం పైన, అధికారుల పైన ఒత్తిడి తెచ్చి ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి, మౌలిక వసతులు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. కలెక్టర్ గడియారం ఆసుపత్రిని సందర్శించి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాధాకృష్ణ

మున్సిపాలిటీ స్థలాలను పరిరక్షించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రాధాకృష్ణ

ప్రజాశక్తి-ఆదోని

ఆదోని పట్టణంలో మున్సిపాలిటీ స్థలాలను పరిరక్షించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2011లో పట్టణంలోని నిర్మల్ టాకీస్ పక్కనున్న మున్సిపాలిటీ స్థలాలను పరిరక్షించాలని సిపిఎం ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహించామన్నారు. రూ.కోట్ల విలువ చేసే మున్సిపాలిటీ స్థలాలను పరిరక్షించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. మున్సిపాలిటీ స్థలాలు కబ్జాలకు గురికాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, పట్టణ నాయకులు తిప్పన్న, వీరేష్, వెంకటేష్, నాగేంద్ర, నాగరాజు, మునెప్ప పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు చర్యలు

- జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస్

ప్రజాశక్తి - నందవరం



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న అధికారులు

బాల్య వివాహాల నిర్మూలనకు అధికారులందరూ సహకరించుకోవాలని జిల్లా కోఆర్డినేటర్ కె.శ్రీనివాస్, ఎంపిడిఒ కృష్ణమూర్తి తెలిపారు. గురువారం నందవరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జిల్లా స్థాయి అధికారి ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలన కోసం మండల స్థాయి అధికారులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 18 ఏళ్లు నిండకుండా పెళ్లి చేయడం నేరమని, అందుకు తల్లిదండ్రులకు కూడా శిక్షలు పడతాయని హెచ్చరించారు. వయస్సు నిండకుండానే పెళ్లి చేయడం వల్ల కాన్పులు, పిల్లల పెంపకాల్లో అమ్మాయికి ఇబ్బందులు వస్తాయని తెలిపారు. ఒక్కో సమయంలో అమ్మాయికి ప్రాణాపాయం కూడా ఉంటుందన్నారు. గ్రామాల్లో వయస్సు నిండకుండానే పెళ్లిళ్లు చేస్తే సమాచారం అందించాలని కోరారు. అనంతరం గోడపత్రికను ఆవిష్కరించారు. తహశీల్దార్ రఘువీరా, ఇఒఆర్‌డి ఈశ్వరయ్య స్వామి, ఎంఇఒ సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్

ప్రజాశక్తి - ఆదోని



టీకాలు ప్రారంభిస్తున్న డిప్యూటీ డిఎంహెచ్ఒ సత్యవతి

హజ్ యాత్రకు వెళ్లే యాత్రికులకు వ్యాధి నిరోధక వ్యాక్సినేషన్ టీకాలు వేశామని ఆదోని డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతి తెలిపారు. గురువారం ఆదోనిలోనిఓ ఫంక్షన్ హాలులో వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు హజ్ యాత్రికులకు మేనింగో కోకల్, ఇన్ ఫ్లూ యొంజా టీకాలు, ఓరల్ పోలియో డ్రాప్ ఇచ్చామన్నారు. ఈ ప్రాంతం నుంచి సుమారు 85 మంది యాత్రికులు త్వరలోనే బయల్దేరుతున్నారని తెలిపారు. వ్యాక్సినేషన్ డిక్లరేషన్ సర్టిఫికెట్ కూడా ఇస్తున్నామని చెప్పారు. డాక్టర్లు ఈశ్వర్ రాజా, అనిల్, సాజిదా, సూపర్‌వైజర్లు ఇంద్ర దొరతి, వెంకటేశులు, హెల్త్ సెక్రటరీలు ప్రమీల, నాగమ్మ, పద్మ, బుజ్జమ్మ, కార్యక్రమ నిర్వాహకుడు ముస్తాక్, ఆశావర్కర్లు ఉన్నారు.

అందుబాటులో రైతు భరోసా జాబితా

- ఎఒ ఆనంద్

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలోని 13 పంచాయతీల్లో ఉన్న రైతు భరోసా కేంద్రాల్లో నూతనంగా విడుదలవుతున్న రైతు భరోసా జాబితాను అందుబాటులో ఉంచామని ఎఒ ఆనంద్ రైతులకు సూచించారు. గురువారం చిప్పగిరి వ్యవసాయ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలో కొత్తగా రైతు భరోసాకు అర్హత సాధించిన రైతులు 149 మంది ఉన్నారని తెలిపారు. గతంలో తీసుకున్న రైతులతోపాటు కొత్తవారు కూడా జాబితాలో ఉంటారన్నారు. రైతులు సరి చేసుకొని ఒకవేళ పేర్లు లేకపోతే సంబంధిత రైతు భరోసా కేంద్రంలో అగ్రికల్చర్ అసిస్టెంట్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. ఈనెల 30న రైతు భరోసా మొదటి విడత నిధులను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పత్తికొండ పట్టణంలో రైతుల సమక్షంలో బటన్ నొక్కి విడుదల చేస్తారని చెప్పారు.

ఇరుకుగా రోడ్లు...

- పట్టించుకోని అధికారులు
- రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- ముఖ్యమంత్రి హామీని అమలు చేయని అధికారులు

ప్రజాశక్తి - ఆదోని

రోడ్లు వెడల్పు చేయించి, ఆదోని పట్టణ అభివృద్ధికి అహర్నిశలు పాటు పడతామని పాలకులు చెబుతూనే ఉన్నారు. ప్రభుత్వాలు మారినా, ఎమ్మెల్యేగా ఎవరు ఎన్నికైనా ఆదోని పట్టణ అభివృద్ధిని మాత్రం పట్టించుకోవడం లేదు. మిల్లులు, పరిశ్రమలు ఉండడం వల్ల వందలాది మంది కార్మికులకు ఉపాధి కల్పిస్తూ ఆదోని గతంలో వ్యాపార కేంద్రంగా వెలిగింది. ప్రస్తుతం మారిన సంస్కరణల వల్ల మిల్లులు, పరిశ్రమలు మూతపడడంతో ఉపాధి కరువై యువత, కూలీలు ముంబయి, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ సుదూర ప్రాంతాలకు వలస వెళ్తున్న పరిస్థితి ఉంది. ఇక్కడ కొత్తగా పరిశ్రమలు పెట్టేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని, నీటి వసతి మాత్రం కల్పిస్తే మరింత అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉందని పలువురు చెబుతున్నా, ఆ దిశగా పాలకులు కృషి చేయడం లేదన్నది తెలిసింది.

ఇరుకైన రోడ్లు

ఆదోని పట్టణంలో మున్సిపల్ మెయిన్ రోడ్డు గుండానే బళ్లారి, సిరుగుప్ప, రాయచూర్, మంత్రాలయం ప్రాంతాలకు వాహనాలు వెళ్లాల్సి ఉంది. ఆ రోడ్డు గుండానే వ్యవసాయ మార్కెట్ యార్డుకు పంట ఉత్పత్తులు వాహనాల్లో తరలుతున్నాయి. ఉదయం పూట పాత బస్టాండ్ కూడలిలో వాహనాలు నిలిచి ఆ ప్రాంతమంతా రద్దీగా మారుతోంది. ప్రత్యామ్నాయ రోడ్డు లేకపోవడం వల్ల ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల నుంచి పోలీసు కంట్రోల్ రూమ్ వరకు 80 అడుగులు, ఎమ్మిగనూరు టర్నింగ్ నుంచి ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ వరకు 100 అడుగులు, ఎమ్మిగనూరు టర్నింగ్ నుంచి కొత్త బస్టాండ్ బైపాస్ రోడ్డు వరకు 80 అడుగులు రోడ్డు వెడల్పు ఉన్నట్లు



వాహనాలతో రద్దీగా ఉన్న మెయిన్ రోడ్డు


రికార్డులు చెబుతున్నాయి. ప్రస్తుతం అన్యాక్రాంతం కారణంగా రోడ్లు ఇరుకుగా మారాయి.

పెరిగిన వాహనాలు : పట్టణంలో సుమారు 2.5 లక్షలకు పైగానే జనాభా ఉంది. రోజూ చుట్టుపక్కల ప్రాంతాల వారు వ్యాపార, ఇతర పనుల నిమిత్తం వచ్చే వారి సంఖ్య అధికంగానే ఉంటుంది. ఈ కారణంగా వాహనాలు వాడే సంఖ్య కూడా రోజురోజుకు పెరుగుతోంది. కనీసం బైక్‌లు నిలుపుకునేందుకు కూడా స్థలం లేకపోవడంతో రోడ్ సైడ్ నిలిపి పోలీసు కేసులు పెట్టించుకుంటూ జరిమానాలు చెల్లించాల్సి వస్తుందని పలువురు వాపోతున్నారు.

అమలు కాని ముఖ్యమంత్రి హామీ : ఆదోని పట్టణంలో రోడ్లు వెడల్పునకు రూ.60 కోట్లు కేటాయిస్తున్నామని గతేడాది జులై మాసంలో ఆదోని పర్యటనలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చారు. హామీ ఇచ్చి ఏడాది గడిచినా అమలుకు నోచుకోకపోవడంతో అధికారుల అలసత్వం తేటతెల్లమవుతోంది. మున్సిపల్ మెయిన్ రోడ్డు నుంచి పిఎన్ రోడ్డు, ఎంఎం రోడ్లలో 1.20 కిలోమీటరు చొప్పున వెడల్పు చేసేందుకు అధికారులు కొలతలు వేశారు. నిధులు చాలకపోవడంతో రికార్డులకే పరిమితమైంది. రోడ్డు వెడల్పు 60 అడుగులు చేయాలని అందులో ఉందని అధికారులు చెబుతున్నారు. నష్టపరిహారం సహాయంతో కలిపి రూ.1.60 కోట్లు అవసరం ఉందని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు.

ఎన్నికల హామీని నెరవేర్చాలి


- ఈరన్న, పట్టణ పౌర సంఘాల సమైక్య కన్వీనర్, మాజీ కౌన్సిలర్



రోడ్లు ఇరుకుగా ఉండడం వల్ల నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆదోని నుంచి బయటకు వెళ్లేందుకు మరో రోడ్డు లేకపోవడం వల్ల పట్టణం గుండానే భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. అన్యాక్రాంతమైన లింక్ రోడ్లు వెడల్పు చేసి పట్టణ అభివృద్ధికి అధికారులు చర్యలు తీసుకోవాలి. రోడ్లు వెడల్పు చేస్తామని, మాస్టర్ ప్లాన్ అమలు చేస్తామని ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి నిలబెట్టుకోవాలి. అధికారులు నిర్లక్ష్యం చేస్తే పురవాసులతో ఆందోళన నిర్వహిస్తాం.

రోడ్డు వెడల్పునకు ప్రతిపాదనలు

- రఘునాథరెడ్డి, మున్సిపల్ కమిషనర్, ఆదోని



ఆదోని పట్టణంలోని పిఎన్ రోడ్డు, మున్సిపల్ మెయిన్ రోడ్డు వెడల్పునకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. ఇప్పటికే మెజర్‌మెంట్ పూర్తి చేసి రికార్డులు ప్రభుత్వానికి పంపాం. గణేష్ సర్కిల్ నుంచి మున్సిపల్ రోడ్డు వరకు సుమారు 2.5 కిలోమీటర్లు రోడ్డు వెడల్పునకు ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చింది. నిధులు రాగానే నష్టపరిహారం అందించి రోడ్ల వెడల్పునకు చర్యలు తీసుకుంటాం.

శ్రీమఠం ఆధ్వర్యంలో సామూహిక ఉపనయనం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్రస్వామి



ఉపనయనం నిర్వహిస్తున్న పీఠాధిపతులు

మఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థుల ఆశీస్సులతో శ్రీమఠం ఆధ్వర్యంలో సామూహిక ఉపనయనం నిర్వహించారు. గురువారం కర్ణాటక రాష్ట్రంలోని నంజనగూడ శ్రీరాఘవేంద్రస్వామి మఠం ఆధ్వర్యంలో రాయచూర్ శాఖలో పీఠాధిపతులు శ్రీసుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో పండితుల వేద మంత్రాలతో, మంగళ వాయిద్యాల నడుమ 30 మంది వటులకు సామూహిక ఉపనయనం చేశారు. ఈ సందర్భంగా పీఠాధిపతులు నూతన వటులందరికీ శేష వస్త్రం, ఫల మంత్రాక్షతలు అందజేసి ఆశీర్వదించారు. ఇంతటి మహత్తరమైన కార్యక్రమాన్ని నిర్వహించినందుకు శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులకు వటుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

రాఘవేంద్రుని సన్నిధిలో భక్తుల కోలాహలం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన శ్రీరాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో శ్రీమఠంలో కోలాహలం నెలకొంది. గురువారం రాఘవేంద్రుని దర్శనార్థమై దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు మంత్రాలయం చేరుకున్నారు. ముందుగా తుంగభద్ర నదిలో పుణ్య స్నానాలు చేసి గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రుని మూల బృందావనాన్ని దర్శించుకుని మంగళ హారతులు స్వీకరించారు. స్వామి వారికి ప్రత్యేక సేవలు చేయించిన భక్తుల సమక్షంలో రాఘవేంద్రుని బృందావన ప్రతిమకు శ్రీమఠం దివాన్ సుధీంద్రాచార్ విశేష పూజలు నిర్వహించారు. అనంతరం బృందావనాన్ని స్వర్ణ పల్లకిలో ఉంచి వేద మంత్రాలతో, మంగళ వాయిద్యాల నడుమ శ్రీమఠం ప్రాకారంలో వైభవంగా ఊరేగించారు.

ప్రభుత్వ భూమిలో రియల్ ఎస్టేట్ దందా

- అధికారుల అండతో ప్లాట్లు వైసిపి నాయకుడు

ప్రజాశక్తి - కోసిగి రూరల్

కోసిగి మండలం దొడ్డిబెళగల్ గ్రామ పరిధిలో సర్వే నెంబర్ 358, 360లో ఒక ఎకరా ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిలో లేఅవుట్లు వేసి ప్రభుత్వ ఖజానాకు భారీగానే గండి కొడుతున్నారు. ప్రభుత్వ భూమిలో ఏకంగా రాళ్లు పాతి ప్లాట్లు వేశారు. స్థానిక వైసిపి నాయకునికి మండల అధికారుల అండ ఉండడంతో ప్రభుత్వ భూమిలో లేఅవుట్లను అడ్డుకోలేకపోయారని డి.బెళగల్ గ్రామానికి చెందిన పలువురు గ్రామస్తులు అధికారుల తీరుపై మండిపడుతున్నారు. గతంలో దొడ్డి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఈ ప్రభుత్వ భూమిని సాగు చేశారు. దాదాపు రూ.22 లక్షలకు వారి నుంచి ఈ ప్రభుత్వ భూమిని ఓ వైసిపి నాయకుడు తీసుకుని పాట్లు వేశారు. ప్రధాన రోడ్డు పక్కనే ఈ ప్రభుత్వ వంక పొరంబోకు భూమి ఉండడంతో బారీగానే డిమాండ్ చేస్తుంది. ప్రభుత్వం జగనన్న ఇంటి పట్టాలు గ్రామంలో ఒక్కరికి కూడా ఇవ్వలేదని, ఇలా ప్రభుత్వ భూమిలో ఇల్లు లేని నిరుపేదలకు స్థలాలు ఇచ్చి ఆదుకోవాలని ఆ గ్రామస్తులు కోరుతున్నారు. ప్రభుత్వ భూముల్లో ప్లాట్లు వేసి విక్రయానికి పెట్టడం, అధికారుల అండదండలతోనే ఆ వైసిపి నాయకుడు భూదందాకు తెర లేపాడని ఆ గ్రామంలో చర్చించుకుంటున్నారు. సొంత వైసిపి నాయకులే ఆ నాయకునిపై తీవ్ర అసంతృప్తిలో ఉన్నట్లు తెలిసింది. అలాగే ఊరి పక్కన ఉన్న కొండ సమీపంలో కూడా గరుసు వేసి కొండా స్థలాన్ని కూడా కబ్జా చేసి బండలు పాతారు. అది ప్రభుత్వ భూమి అని, ఆ భూమిలో ఎలాంటి లేఅవుట్లు వేయకూడదని స్థానికంగా ఉండే విఆర్ఒ, గ్రామ సర్వేయర్ చెప్పినా, ఆ భూమి అమ్మరాదు, కొనరాదని తెలియజేసినా వైసిపి నాయకుడు మాత్రం మండల స్థాయి అధికారుల అండదండలతో ప్లాట్లు వేయడం విమర్శలకు తావిస్తోంది. ప్రభుత్వ భూముల్లోనే రియల్ ఎస్టేట్ వ్యాపారం కొనసాగిస్తుండడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఉన్నతాధికారులు స్పందించి ఇలాంటి ప్రభుత్వ భూములను గుర్తించి తమ గ్రామంలో స్థలం లేని నిరుపేదలకు జగనన్న ఇంటి స్థలాలివ్వాలని గ్రామస్తులు కోరుతున్నారు. డి.బెళగల్ సర్పంచి మాల పద్మమ్మ కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. ఎలాంటి అనుమతులూ లేకుండా అక్రమంగా ప్రభుత్వ భూములను కబ్జా చేసిన వారిపై జిల్లా రెవెన్యూ అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.



ప్రభుత్వ భూముల్లో వేసిన లేఅవుట్లు



నిందితుని మీడియా ముందు ప్రవేశపెట్టిన పోలీసులు

యువతిని వేధిస్తున్న యువకుని అరెస్టు

ప్రజాశక్తి - మంత్రాలయం

సోషల్ మీడియా ద్వారా యువతిని వేధిస్తున్న యువకుని అరెస్టు చేసినట్లు సిఐ శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఆయన మండలంలోని మాధవరం పోలీసు స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు చెందిన నారాయణ కుమారుడు సంజయ్ ఎన్.రాథోడ్ మాధవరం తండాకు చెందిన యువతి పెళ్లికి నిరాకరించిందని వేధించేవాడని తెలిపారు. యువతిని, ఆమె తల్లిదండ్రులను తండాకు చెందిన కొందరి యువకులతో కలిసి సోషల్ మీడియా ద్వారా బ్లాక్ మెయిల్ చేస్తూ వేధింపులకు పాల్పడడమే కాక అశ్లీల చిత్రాలను అనుకూల వ్యక్తులకు పంపించేవాడని చెప్పారు. సాక్ష్యాధారాల ఆధారంగా కేసు నమోదు చేసి అరెస్టు చేశామని తెలిపారు. ఇందులో మరికొందరి ప్రమేయం ఉందని, తగిన ఆధారాలు రాగానే వారిని కూడా అరెస్టు చేస్తామని చెప్పారు. మహిళలను సోషల్ మీడియా ద్వారా వేధింపులకు గురి చేయడం నేరమని, అలాంటి వారిపై ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఎస్ఐ కిరణ్ బాబు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కడిమెట్లలో వైసిపి, టిడిపి గ్రూపుల మధ్య ఘర్షణ



చికిత్స పొందుతున్న బాధితులు చంద్రశేఖర్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

మండలంలోని కడిమెట్ల గ్రామంలో ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి అనుచరులు, అదే గ్రామానికి చెందిన టిడిపి నాయకుల మధ్య పొలం తగాదా విషయంలో ఘర్షణ చోటు చేసుకుంది. ఘర్షణలో టిడిపి నాయకుడు చంద్రశేఖర్‌కు గాయాలు కావడంతో స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తమ పొలానికి ఇంజక్షన్ ఆర్డర్ కోర్టు ఇచ్చినప్పటికీ తాను, తన అన్న బైక్‌పై వెళ్తుంటే ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి తమ దాయాదులను తమను హత్య చేయడానికి పంపించారని తెలిపారు. తాము ఆత్మ రక్షణ కోసం తిరుగుబాటు చేశామని వివరించారు.

సబ్సిడీ విత్తనాల కోసం రైతులు పేర్లు నమోదు చేసుకోవాలి

- ఎఒ శివశంకర్

ప్రజాశక్తి - హాలహర్వి

ఖరీఫ్ సీజన్‌లో సబ్సిడీ విత్తనాలు, ఎరువులు అవసరమైన రైతులు పేర్లు నమోదు చేసుకోవాలని ఎఒ శివశంకర్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడారు. 2023-24 సంవత్సరానికి ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ప్రభుత్వం విత్తనాలు, ఎరువులు మంజూరు చేసినట్లు తెలిపారు. మండలానికి 190 క్వింటాళ్ల వేరుశనగ, 4 క్వింటాళ్ల కందులు కేటాయించినట్లు చెప్పారు.



మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన ఎమ్మెల్యే ఎర్రకోట

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

విజయవాడ కార్యాలయంలో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గనుల, భూగర్భ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. గురువారం నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించారు. నియోజకవర్గంలోని పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, భూగర్భ శాఖ నిధులను కేటాయించాలని కోరారు.

కేశవరెడ్డి కేబుల్ దందాను అరికట్టాలి : కేబుల్ ఆపరేటర్లు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని గాంధీనగర్ కౌన్సిలర్ కేశవరెడ్డి కేబుల్ దందా చేస్తున్నారని, దందాను అరికట్టాలని కేబుల్ ఆపరేటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. ప్రశాంతంగా ఉన్న ఎమ్మిగనూరు కేబుల్ ఆపరేటర్లను ఈయన రాజకీయ అండతో అన్ని ఏరియా ఆపరేటర్లను ఇబ్బంది పెడుతున్నారని పేర్కొన్నారు. కేబుల్ ఆపరేటర్లను భయపెట్టి తన గుప్పెట్లో ఉంచుకోవాలని చూస్తున్నారని వాపోయారు. 30 ఏళ్లుగా అందరం కలిసి ఉన్నామని, ఎవరి ఏరియాను వారు నడుపుతున్నామని తెలిపారు. ఎపి ఫైబర్ నెట్‌వర్క్ నెపంతో గవర్నమెంట్ ఇచ్చిన ఎపి ఫైబర్ లీడలు అందరూ ఆపరేటర్లకు ఇవ్వకుండా తన రాజకీయ బలంతో అధికారిని మేనేజ్ చేసి ఎమ్మిగనూరులో అన్ని కాలనీల్లోకి దౌర్జన్యంగా చొరబడుతున్నారని వాపోయారు. దీనినే నమ్ముకుని బతుకుతున్న ఆపరేటర్లు వైసిపి నాయకుని ఎదిరించలేక మీడియా ముందుకొచ్చామని చెప్పారు. కేబుల్ ఆపరేటర్లకు ఎపి ఫైబర్ కనెక్షన్ ఇవ్వకుండా అడిగిన వారిని బెదిరిస్తూ 'నేను కౌన్సిలర్‌ని. ప్రభుత్వం మాది' అని నిర్లక్ష్యపు సమాధానం చెబుతున్నారని వాపోయారు. అడిగితే తనకు నచ్చిన వారికిచ్చి కొంతమందికి ఇవ్వకుండా దౌర్జన్యంగా కాలనీలోకి తీగలు లాగుతున్నారని, డబ్బులు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. ఎపి ఫైబర్‌కు కట్టాల్సిన డబ్బులు కాకుండా అదనంగా డిమాండ్ చేస్తున్నారని వాపోయారు.

నిష్పక్షపాతంగా పేదలకు సేవలందించాలి

- ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

సంక్షేమ పథకాలను పేదలకు అందజేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డి వాలంటీర్లకు సూచించారు. గురువారం పట్టణంలోని ఎస్‌కెడి కాలనీ మున్సిపల్ పార్కులో వాలంటీర్లకు ప్రోత్సాహక నగదు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి అధ్యక్షత వహించారు. అంతకుముందు మున్సిపల్ ఛైర్మన్ శాంత జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి మాట్లాడారు. లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను చేరవేయడంలో కొందరు వాలంటీర్లు అక్రమాలకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. పద్ధతి మార్చుకొని నిజాయితీగా పని చేయాలని సూచించారు. లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు ప్రత్యక్షంగా ఎంపీ, ఎమ్మెల్యే, ఇతర ప్రజాప్రతినిధులకు సేవ చేసే అవకాశం లేదని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వాలంటీర్లకు అలాంటి అవకాశం కల్పించారని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సేవాభావం కలిగి, ఉన్న ప్రాంతంలోనే పేదలకు ఆర్థికంగా అండగా నిలవాలని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించే పథకాల్లో పేదలు లబ్ధి పొందేలా చూడాలన్నారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ నరసింహులు, మున్సిపల్ మేనేజర్ విజయభాస్కర్ రెడ్డి, కౌన్సిలర్లు లక్ష్మీదేవి, చిన్న, చలపతి, రాజేశ్వర్ రెడ్డి, నాయకులు రమేష్ యాదవ్, మధు, చంద్రశేఖర్ రెడ్డి, సచివాలయ ఉద్యోగులు రాము, రవి, వీర, ప్రవళిక ఉన్నారు.



వాలంటీర్లను అభినందిస్తున్న ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి

విజేతలకు నగదు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి - కోసిగి రూరల్

కోసిగిలోని మౌంట్ కార్మెల్ స్కూల్‌లో నిర్వహించిన బాస్కెట్ బాల్ టోర్నమెంట్‌లో గెలుపొందిన జట్లకు కోల్మాన్ పేట గ్రామానికి చెందిన ఉప్పలపాటి అర్జున్ నగదు బహుమతులు ప్రదానం చేశారు. గురువారం కోసిగి, ఆలూరు జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. ఫైనల్‌లో ఆలూరు జట్టుపై కోసిగి జట్టు గెలుపొందింది. గెలుపొందిన కోసిగి జట్టుకు మొదటి బహుమతి రూ.6 వేలు, రన్నర్‌గా నిలిచిన ఆలూరు జట్టుకు రూ.4 వేలు కోల్మాన్ పేట గ్రామానికి చెందిన యువ నాయకులు ఉప్పలపాటి అర్జున్ అందజేశారు. మౌంట్ కార్మెల్ కరస్పాండెంట్ జోజి, అంపైర్లు ప్రతాప్, శేఖర్, ఆర్గనైజింగ్ సభ్యులు వేణు, శ్రీధర్ పాల్గొన్నారు.



విజేతలకు నగదు అందజేస్తున్న యువ నాయకులు అర్జున్

ఉచిత స్కానింగ్ శిబిరానికి స్పందన

ప్రజాశక్తి - ఆదోని

అంబేద్కర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ నగర్‌లో గురువారం నిర్వహించిన ఉచిత స్కానింగ్ శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. స్టార్, కేర్, నేషనల్, గీతాంజలి నర్సింగ్ హోమ్‌ల ట్రైన్ నర్సింగ్ విద్యార్థులు బీపీ, షుగర్, ఈసీజీ తదితర పరీక్షలను డాక్టర్ శాంతి జ్యోతి, డాక్టర్ సుజాత, డాక్టర్ సైఫుల్లా పర్యవేక్షణలో నిర్వహించారు. ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. భారతీయ భీమ్‌సేన రాష్ట్ర అధ్యక్షులు గుడికల్లు కుమారస్వామి, ఆర్గనైజర్ వైపి.నాగరాజు, వై.నాగరాజ్, మాల మహానాడు డివిజన్ అధ్యక్షులు డి.నరేష్ కుమార్, గోపి, గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న నర్సింగ్ విద్యార్థులు

పెద్ద చెరువును సాగు చేయకుండా ఆపండి

- పెద్దచెరువు సాధన కమిటీ

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని పాండవగల్లు గ్రామంలో ఉన్న ప్రభుత్వ పెద్ద చెరువును సాగు చేయకుండా ఆపాలని పాండవగల్లు పెద్ద చెరువు సాధన కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సాధన కమిటీ కన్వీనర్ ఎం.తాహేర్ వలీ, నాయకులు రామదాసు, వెంకటేష్ మాట్లాడారు. గతంలో డివిజన్ కోర్టు, జిల్లా కోర్టులు ప్రభుత్వానికి అనుకూలంగా ప్రభుత్వ చెరువు అని తీర్పులు ఇచ్చినప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని తెలిపారు. ప్రస్తుతం 2013లో అక్రమ భూస్వామి ఆదోని తహశీల్దార్, ఆర్‌డిఒలపై హైకోర్టులో కేసు వేసిందని, అక్రమ భూస్వామికి అనుకూలంగా కోర్టులో ఎలాంటి స్టే ఆర్డర్ లేదని చెప్పారు. అక్రమ భూస్వామి సాగు చేసుకోవటానికి అధికారులు వత్తాసు పలుకుతున్నారని తెలిపారు. గతేడాది క్రితమే పాండవగల్లు ప్రభుత్వ పెద్ద చెరువు నుంచి ఆదోని తహశీల్దార్ కార్యాలయం వరకు పాదయాత్ర చేశామని చెప్పారు. అధికారులు స్పందించకుండా ఏడాదిలోపు కోర్టులో ఉన్న సమస్యను పరిష్కారం చేసేందుకు కృషి చేస్తామని చెప్పి ఇప్పటివరకు కోర్టుకు హాజరు కాకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హైకోర్టులో అక్రమ భూస్వామికి అనుకూలంగా స్టేట్ లేదని, సాగును ఆపాలని డిమాండ్ చేశారు. లేకపోతే సాగును అడ్డుంటామని హెచ్చరించారు. తర్వాత అక్రమ భూస్వామికి, ప్రజలకు మధ్యన జరిగే నష్టానికి ప్రభుత్వం, అధికారులు, ఎమ్మెల్యే బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. గోపాల్, ఆంజనేయ, చిన్న తయ్యన్న, చంద్రశేఖర్, రంజాన్, రామాంజనేయులు, రాములు, ఇస్మాయిల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పెద్ద చెరువు సాధన కమిటీ సభ్యులు

డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులుగా కరెకృష్ణ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



కర్నూలు నగరంలో జరిగిన డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డిటిఎఫ్) 16వ జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఎమ్మిగనూరులో గుడికల్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న కరె కృష్ణను జిల్లా అధ్యక్షులుగా ఆరోసారి, జిల్లా ఉపాధ్యక్షులుగా పాటిల్ ఈశ్వర్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు డిటిఎఫ్ మండల అధ్యక్షులు వీరేష్, ప్రధాన కార్యదర్శి సాయిబాబులు గురువారం హర్షం వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన కరె కృష్ణ గత 24 ఏళ్లుగా డిటిఎఫ్ నిర్మాణం కోసం విశేష కృషి చేస్తున్నారని తెలిపారు. కృష్ణ, ఈశ్వర్ రెడ్డి డిటిఎఫ్ ఫ్యాప్టో, ఎపిజెఎసి, ఎపిఎస్ఈసి, రాయలసీమ, ప్రజా ఉద్యమాల్లో పాల్గొని సేవలు అందించారని చెప్పారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో రాజీలేని పోరాటం చేస్తున్నారని కొనియాడారు. మండల నాయకులు జయానంద్, జగదీష్, చంద్రశేఖర్ యాదవ్, హాసన్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో ఎమ్మిగనూరు ప్రతిభ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

జాతీయస్థాయి పోటీల్లో ఎమ్మిగనూరు విద్యార్థులు ప్రతిభ చాటారు. అండర్-14 సబ్ జూనియర్, అండర్-18 జూనియర్, అబౌవ్ 18 సీనియర్స్ విభాగాల్లో జరిగిన పోటీలకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. రాష్ట్రం నుంచి 88 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈనెల 19, 20, 21న జరిగిన పోటీల్లో ఎమ్మిగనూరు నుంచి అండర్-14 సబ్ జూనియర్ విభాగంలో ముందరింటి దక్షిత, బోయ సుమిత్ర, ముందరింటి మోక్షిత, అంజూం ఖుషి సిల్వర్ మెడల్స్ సాధించి జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచారు. ఇదే పోటీల్లో మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో ఎమ్మిగనూరుకు చెందిన ముందరింటి మోక్షిత, నెల్లూరుకు చెందిన వైభవ్ జట్టు సిల్వర్ మెడల్స్ సాధించి జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచారు. అండర్-18 విభాగంలో ఉప్పర హారిక, బోయ వైశాలి, అండర్-14 విభాగంలో కనికె జ్యోతి, సుచిత్ర కాంస్య మెడల్ సాధించారు. ఆంధ్రప్రదేశ్ జట్టు అత్యుత్తమ ప్రతిభ కనబరచడం వల్ల ఓవరాల్ చాంపియన్‌షిప్ దక్కింది.

వివాహ వేడుకల్లో వీరభద్ర గౌడ్

ప్రజాశక్తి - హాలహర్వి

మండలంలోని నిట్రవట్టి గ్రామంలో గురువారం జరిగిన వివాహ వేడుకలకు టిడిపి ఆలూరు నియోజకవర్గ మాజీ ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. స్థానిక మాజీ సర్పంచి బసప్ప తమ్ముడు సదాశివ కుమారుని వివాహానికి హాజరయి వధూవరులను ఆశీర్వదించారు. ఆలూరు మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ కురువ జయరాం, టిడిపి యువ నాయకులు తిప్పేస్వామి, సికిందర్ పాల్గొన్నారు.

మాల సింహ గర్జన సభను జయప్రదం చేయాలి

- మాల మహానాడు నాయకులు

ప్రజాశక్తి - హోళగుంద

మాల సింహగర్జన సభను జయప్రదం చేయాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షులు మహానంది కోరారు. గురువారం మండలంలోని గజ్జహళ్లి, చిన్నహ్యాట, వందవాగిలి, పెద్ద గోనెహాళ్ గ్రామాల్లో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో దళితుల పట్ల అంటరానితనం, అస్పృశ్యత, చిన్న చూపు చూస్తున్నారని తెలిపారు. అంబేద్కర్ ఆశయాలను, రాజ్యాంగాన్ని మార్చేయాలని చూస్తున్నారని విమర్శించారు. మాల కుటుంబ సభ్యులందరూ ఈనెల 31న జరిగే మాల సింహగర్జన సభకు హాజరయి జయప్రదం చేయాలని కోరారు. పెద్దలు, యువత, మాల మహానాడు జిల్లా కమిటీ నాయకులు ఈరన్న, వన్నూరు, గోపాల్, వీరభద్ర, నాగరాజు, మల్లికార్జున, భరత్ పాల్గొన్నారు.





విలేకరుల సమావేశంలో విఆర్వో నకిలీ సర్టిఫికెట్లను చూపుతున్న బోయ వెంకటేశ్వర్లు

లోకేష్ సాక్షిగా

టిడిపిలో భగ్గుమన్న విభేధాలు

- డోన్‌లో ధర్మవరం వర్సెస్ కెఇ..
- నంద్యాలలో ఎవి సుబ్బారెడ్డిపై అఖిలప్రియ గ్రూపు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

నారా లోకేష్ చేపట్టిన యువగళం యాత్ర సందర్భంగా నంద్యాల జిల్లాలోని టిడిపిలో విబేధాలు భగ్గుమన్నాయి. డోన్‌లో ధర్మవరం సుబ్బారెడ్డిపై కెఇ వర్గం కరపత్రాలు ముద్రించారు. నంద్యాలలో ఎవి సుబ్బారెడ్డిపై అఖిలప్రియ వర్గం దాడికి పాల్పడింది. దీంతో లోకేష్ రాక సఖ్యతను నింపలేకపోయిందనే చర్చ సాగుతోంది...



టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర గత నెల 13న డోన్ నియోజకవర్గంలో మొదలై తాజాగా ఆళ్లగడ్డ నియోజకవర్గంతో ముగిసింది. ఆయన రాక సందర్భంగా డోన్, నంద్యాలలో టిడిపిలో విబేధాలు తీవ్ర స్థాయిలో భగ్గుమన్నాయి. యువగళం పాదయాత్ర జిల్లాలో మొదటగా డోన్ నియోజకవర్గం లోకి ప్రవేశించింది. రెండు రోజుల పాటు ఆ నియోజక వర్గంలోని ప్యాపిలి మండలంలో సాగింది. మొదటి రోజు అంతా ప్రశాంతంగానే కనిపించినా రెండో రోజు పార్టీలో ఒక గ్రూపు ముద్రించిన కరపత్రాలు బయట కు వచ్చాయి. తెలుగుదేశం డోన్ నియోజకవర్గం వీరాభిమానులు నారా లోకేష్ కు విన్నవిస్తున్నట్లు ఆ కరపత్రాలను ముద్రించారు. నియోజకవర్గ ప్రస్తుత ఇంచార్జి వల్ల పార్టీకి తీవ్ర నష్టం జరుగుతోందని, టిడిపిలో ఉన్న వైసిపి కోవర్టులా పనిచేస్తున్నాడని అందులో పేర్కొన్నారు. "టిడిపి పార్టీ ఆవిర్భవించి నప్పటి నుండి ఉన్న నాయకులను, కార్యకర్తలను పార్టీకి దూరం చేస్తున్నాడు. ఇప్పుడు ఉన్న ఇంచార్జి ప్రస్తుత ఆర్థిక మంత్రి బుగ్గనతో సత్సంబాలు కలిగి తన వ్యాపారాలకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా టిడిపిని తాకట్టు పెట్టి ఇంచార్జ్ పబ్బం గడుపుతున్నారు." అని ఆ కరపత్రంలో పేర్కొన్నారు. దయుంచి డోన్ ఇంచార్జి నియామకం గురించి పునరాలోచి ంచండి.. పార్టీని బ్రతికిం చండి.. అంటూ విన్నవించారు. ఈ కరపత్రం సామాజిక మాధ్యమల్లోనూ చక్కర్లు కొట్టడంతో నియోజవర్గంలో తీవ్ర చర్చ సాగుతోంది. నంద్యాల నియోజకవర్గంలోనూ టిడిపిలో విబేధాలు బయటపడ్డాయి. ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ మాజీ ఛైర్మన్ ఏవి సుబ్బారెడ్డిపై భూమా అఖిల ప్రియ వర్గం దాడులకు దిగింది. లోకేష్ పాదయాత్ర నంద్యాల జిల్లా కొత్తపల్లె విడిది కేంద్రానికి చేరుకున్న సమయంలో లోకేష్ వెంట అఖిల ప్రియ, విఖ్యాత్ రెడ్డి, ఎవి సుబ్బారెడ్డి భారీ జనసమూహంతో వెళ్తుండగా లోకేష్ విడిది ప్రాంతం చేరుకోగానే లోకేష్ తో పాటు వెళ్తున్న అఖిల ప్రియను తోసుకొని ఎవి సుబ్బారెడ్డి వెళ్లేందుకు ప్రయత్నం చేయడంతో ఆమెకు ఎవి సుబ్బారెడ్డి చేయి తగిలింది. దీంతో అఖిల ప్రియా అనుచరులు ఎవి సుబ్బారెడ్డి పై దాడికి పాల్పడ్డారు. ఈ సంఘటనలో సుబ్బారెడ్డి కింద పడిపోయారు. వెంటనే పోలీసులు అందరిని చెదరగొట్టి ఎవి సుబ్బారెడ్డిని కారులో పంపించి వేశారు. ఏవి సుబ్బారెడ్డికి స్వల్ప గాయాలు కాగా ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఎవి సుబ్బారెడ్డి ఫిర్యాదుతో అఖిలప్రియ, ఆయన భర్త భార్గవ్‌రామ్ సహా 11 మందిపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో అఖిలప్రియ దంపతులు జైలుకు వెళ్లి బుధవారమే బెయిల్‌పై బయటకు వచ్చారు. గత కొద్ది కాలంగా ఇరువర్గాల మధ్య విభేదాలు నడుస్తున్నాయి. ఇలా టిడిపిలో విబేధాలు బయటపడటంతో లోకేష్ పాదయాత్ర నాయకుల్లో ఉన్న విబేధాలను మరింత పెంచిందనే చర్చ జిల్లాలో నడుస్తోంది.

నకిలీ సర్టిఫికెట్లతో విఆర్ఒ ఉద్యోగం

- ఫిర్యాదు చేసినా పట్టించుకోని రెవెన్యూ శాఖ
- తలారి చిన్న వెంకటేశ్వర్లుపై చర్యలు తీసుకోవాలి : బి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

బండి ఆత్మకూరు మండలంలోని కాకునూరు విలేజ్ రెవెన్యూ ఆఫీసర్‌గా పని చేస్తున్న బి.వెంకటేశ్వర్లు నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగం చేస్తున్నాడని అతని సోదరుడు బి.వెంకటేశ్వర్లు ఆరోపించారు. అనేకసార్లు జిల్లా కలెక్టర్, ఆర్‌డిఒ, తహశీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. చివరకు లోకాయుక్త లోనూ ఫిర్యాదు చేశానన్నారు. గురువారం బండి ఆత్మకూరు మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'మండలంలోని ఏ.కోడూరు గ్రామానికి చెందిన తలారి చిన్న వెంకటేశ్వర్లు 1972 నుండి 1975 వరకు ఆ గ్రామ ప్రాథమిక పాఠశాలలో అడ్మిషన్ నెంబర్ 443, పుట్టిన తేదీ 01-07-1963గా రికార్డులలో నమోదు చేసుకున్నాడు. అనంతరం ఏడవ తరగతి కోసం అడ్మిషన్ 1420 నెంబర్‌తో 1976 నుండి 1977 ఫిబ్రవరి వరకు పాఠశాలకు వచ్చి అనంతరం మధ్యలోనే చదువు మానివేశాడని జిల్లా పరిషత్ హెచ్‌ఎం కె.మాధురి ధ్రువీకరించారు. ఆ తర్వాత తలారి చిన్న వెంకటేశ్వర్లు పదవ తరగతి సర్టిఫికెట్ కోసం బోయ వెంకటేశ్వర్లు సన్నాఫ్ బోయ సోమన్న పేరుతో 06-07-2002 సంవత్సరంలో ప్రగతి మోడల్ హైస్కూల్, శ్రీ రామకృష్ణాపురం హైదరాబాద్‌లో ఉత్తీర్ణత పొందినట్లు రికార్డులు సృష్టించాడు. తలారి చిన్న వెంకటేశ్వర్లుగా ఉన్న ఈయన బోయ వెంకటేశ్వర్లుగా నకిలీ ధ్రువీకరణ పత్రాలను సృష్టించి విఆర్వో ఉద్యోగాన్ని సంపాదించాడు. 10వ తరగతి మార్కుల జాబితాలో ఎలాంటి గుర్తింపు మచ్చలు లేకుండా, మార్కు లిస్టు ఉండ టంపై పలు అనుమానాలు వ్యక్తం అవు తున్నాయి. తలారి చిన్న వెంకటేశ్వర్లుతో పాటు విఆర్ఒ ఉద్యోగాలుగా పదోన్నతి పొందిన అందరిపై సమగ్ర విచారణ చేపట్టాలని లోకా యుక్తను కోరాం. ఒకే తల్లికి ఒకే తేదీన ఇద్దరు ఎలా జన్మిస్తారు..? నా సోదరునికి నాకు మూడు సంవత్సరముల కాలవ్యవధి ఉంది. వీటన్నింటిపై సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలి' అని బి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఏకంగా వీఆర్వో ఉద్యోగం నకిలీ ధృవీకరణ పత్రాలతో పొందడం, రెవెన్యూ శాఖ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తు తున్నాయి. భవిష్యత్తులో నిరుద్యోగులకు, విద్యా వంతులకు అన్యాయం జరగకుండా ఉండాలంటే ఇలాంటి నకిలీలపై రెవెన్యూ శాఖ మంత్రి, జిల్లా కలెక్టర్ కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పని చేయని డిజిటల్ ఎక్స్‌రే మిషన్లు

- వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకోండి
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ నివేదన

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్, వైద్యాధికారులు

జిల్లాలోని 13 సామాజిక ఆరోగ్య కేంద్రాలకు సరఫరా చేసిన ఎక్సరే మిషన్లు కంప్యూటెడ్ రేడియాగ్రఫీ సిస్టం పని చేయని కారణంగా డిజిటల్ ఎక్సరేలు వినియోగంలో లేవని జిల్లా కలెక్టర్ మనజిర్ జిలాని సమూన్ తెలిపారు. వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్.జవహర్ రెడ్డికి నివేదించారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డాక్టర్ కెఎస్.జవహర్ రెడ్డి వివిధ శాఖల కార్యదర్శులతో కలిసి స్పందన అర్జీల పరిష్కారం, భూముల రీ సర్వే, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, నాడు-నేడు, జగనన్న విద్యా కానుక కిట్లు తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ ఛాంబర్ నుండి జిల్లా కలెక్టర్ మనజిర్ జిలాని సమూన్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు జూమ్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రాల్లో ఆపరేషన్ థియేటర్ సంబంధించిన పరికరాలను కూడా పంపిణీ చేయాల్సిందిగా కోరారు. ఎక్సరే మిషన్లకు సంబంధించి రాష్ట్రస్థాయిలో సంబంధిత కంపెనీ ఏజెన్సీలకు ఎక్సరే మిషన్ల టెక్నికల్ సమస్యలు తొలగించమని సూచించామని సంబంధిత ఆరోగ్య శాఖ కార్యదర్శి కలెక్టర్‌కు వివరించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల్లో నాడు-నేడు కింద చేపట్టిన నిర్మాణ పనుల్లో 30 శాతం మాత్రమే నిధులు ఖర్చు పెట్టారని, ఈ నెలాఖరులోపు మిగిలిన పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రాధాన్యత భవన నిర్మాణాలలో భాగంగా వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాలు ఇప్పటివరకు 32 పూర్తి చేశారని, మిగిలిన వాటిని కూడా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. అలాగే ఇంకా ప్రారంభించని హెల్త్ క్లినిక్‌లను వెంటనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పదవ తరగతి, ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులు మళ్లీ విద్యాలయాల్లో చదివేందుకు అడ్మిషన్స్ తీసుకునేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కంటి వెలుగు కార్యక్రమం కింద కాంటాక్ట్ ఆపరేషన్లు అన్ని మౌలిక వసతులున్న ప్రభుత్వ, ప్రవేట్ హాస్పిటల్లో చేయించేందుకు చర్యలు తీసుకోవాలని వైయస్సార్ ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్‌ను ఆదేశించారు.

తూతూమంత్రంగా సామాజిక తనిఖీ

- ఉపాధిలో అవినీతి అక్రమాలు
- ఆధారాలతో చూపినా స్పందించని పథకం ప్రాజెక్టు డైరెక్టర్
- వ్యకాసం జిల్లా అధ్యక్షులు ఎం.నాగేశ్వరరావు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లా కొత్తపల్లె మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కొండను తవ్వి ఎలుక పట్టినట్లుగా సామాజిక తనిఖీ బృందం పని చేసిందని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.నాగేశ్వరావు విమర్శించారు. సంఘం జిల్లా నాయకత్వం ఆధారాలతో చూపించినా ఉపాధి హామీ పథకం ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్.రామచంద్ర రెడ్డి స్పందించకపోవడం దారుణమన్నారు. గురువారం నంద్యాలలోని వ్యవసాయ కార్మిక సంఘం కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా నాయకులు ఆర్.ఈశ్వరయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తపల్లి మండలంలోని ఎదురుపాడు గ్రామంలో ఉపాధి హామీ సిబ్బంది, రాజకీయ నాయకులు కుమ్మక్కై పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఆశావర్కర్స్ సుజాత జాబ్ కార్డు 801025 నెంబర్‌పై 9 వారాల పని చేసినట్లు దాదాపు రూ.10 వేలు, అంగన్వాడీ వెల్ఫేర్ ఆయా పార్వతమ్మ, వాలంటీర్ కవిత, కర్నూల్ సుబ్బారెడ్డి కాలేజీలో చదువుతున్న డిగ్రీ విద్యార్థులు హైమావతి, బోయ పావని పేర్లతో బోగస్ మస్టర్లు వేసుకొని ఉపాధి నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డారని చెప్పారు. అలాగే ఎర్రమఠం గ్రామంలో 270 మంది ఉపాధి హామీ కూలీలతో 2 వారాలు పాటు వర్క్ శాంక్షన్ లేకున్నా పనులు చేయించి, బిల్లులు రాకుండా కూలీల కడుపులు కొట్టారని అన్నారు. ఎపిఒ, ఎంపిడిఒల దృష్టికి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, కూలీలు విషయం తీసుకెళ్లినా అధికారులు స్పందించకపోవడం విచారకరమన్నారు. కొత్తపల్లి మండలంలో 2022-2023 ఆర్థిక సంవత్సరంలో రూ.7 కోట్లు పని జరిగితే అందులో 7 వేల రూపాయలు అవినీతి జరిగినట్లు అధికారులు తేల్చి చెప్పారన్నారు. జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. కొత్తపల్లి మండలంలో సామాజిక తనిఖీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్.రామచంద్ర రెడ్డి దృష్టికి సంఘం జిల్లా నాయకత్వం ఆధారాలతో తీసుకెళ్లి చూపించినా స్పందించకపోవడం దారుణమన్నారు. కొత్తపల్లె మండలంలో ఉపాధి హామీ పథకం జరిగిన అవినీతి అక్రమాలపై జిల్లా కలెక్టర్ స్పందించి సమగ్ర విచారణ చేసి సంబంధిత బాధ్యులపై చట్టపరమైన కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బడ్జెట్లో నిధులు తగ్గించడం, పనుల దగ్గర సౌకర్యాలు రద్దు చేయడం, ఉపాధి నిధులను ఇతర రంగాలకు మళ్ళించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఉపాధి పనుల దగ్గర కనీస సౌకర్యాలు లేక వడదెబ్బతో కూలీలు చనిపోతున్నారని తెలిపారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎన్.స్వాములు, యం.నరసింహనాయక్, ఎం.కర్ణ, శ్రీనివాసులు, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యకాసం జిల్లా అధ్యక్షులు ఎం.నాగేశ్వరరావు



సిఐని సన్మానిస్తున్న మాల మహానాడు సంఘం అధ్యక్షులు మునయ్య

సిఐ రమేష్ బాబుకు ఘన సన్మానం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణ సిఐగా బాధ్యతలు స్వీకరించిన రమేష్ బాబును గురువారం పట్టణ పోలీస్ స్టేషన్లో మాల మహానాడు సంఘం తాలూకా అధ్యక్షులు కుందవరపు మునయ్య, నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మునయ్య మాట్లాడుతూ గతంలో పట్టణ ఎస్ఐగా రమేష్ బాబు విధులు నిర్వహించినప్పుడు ప్రజలకు మంచి సేవలు అందించారని కొనియాడారు. తిరిగి పట్టణ సిఐగా రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సురేష్, కరుణాకర్, మోహన్, చందు, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రామాలయానికి కటాంజనం విరాళం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

మున్సిపాలిటీ పరిధిలోని పడకండ్ల ఎస్సీ కాలనీలో గురువారం కోదండరామ స్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం కన్నుల పండుగగా జరిగింది. గుడిలో ఏర్పాటు చేసిన కటాంజనానికి టిడిపి నాయకులు చింతకుంట్ల రాజశేఖర్ రెడ్డి రూ. 1.50 లక్షలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను ఆలయ మర్యాదలతో సత్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ హుస్సేన్ బాషా, మాజీ జెడ్పిటిసి చాంద్ బాషా, తగిలి శ్రీనివాస్, ఇటిక్యాల శేఖర్ రెడ్డి, టీచర్ మద్దిలేటి, రామ మద్దిలేటి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆలయం వద్ద చింతకుంట్ల రామశేఖర్ రెడ్డి తదితరులు

జి.జంబులదిన్నెలో ఘనంగా జాతర

- హాజరైన ఎమ్మెల్యే గంగుల

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

మండలంలోని జి. జంబులదిన్నె గ్రామంలో గురువారం పెద్దమ్మ తల్లి జాతర ఘనంగా జరిగింది. తెల్లవారుజామునుండే పెద్దమ్మ తల్లికి గ్రామ ప్రజలు, పెద్దలు బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఎంపిపి గజ్జల రాఘవేంద్ర రెడ్డి, గ్రామస్తుల ఆహ్వానం మేరకు శాసనసభ్యులు గంగుల బ్రిజేంద్ర రెడ్డి పెద్దమ్మ తల్లి జాతరకు హాజరయ్యారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దామోదర్ రెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పడకండ్లలో విగ్రహ ప్రతిష్టలో ఎమ్మెల్యే : మున్సిపాలిటీ పరిధిలోని పడకండ్ల ఎస్సీ కాలనీలో జరుగుతున్న కోదండ రాముల వారి విగ్రహ ప్రతిష్ట, ధ్వజస్తంభ ప్రతిష్టలో ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో ప్రతిష్ట చేసిన సీతారాములకు, ధ్వజ స్తంభానికి పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే వెంట వైసిపి నాయకులు బద్రి సుధాకర్ రెడ్డి, బద్రి భాస్కర్ రెడ్డి తదితరులు ఉన్నారు.



పెద్దమ్మను దర్శనం చేసుకుంటున్న ఎమ్మెల్యే

సబ్సిడీపై జీలుగ విత్తనాలు : ఎఒ

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ జీలుగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి స్వప్నికా రెడ్డి తెలిపారు. గురువారం నంద్యాల మండలంలోని చాపిరేవుల గ్రామంలో రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాలను ఆమె పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ మండలానికి పచ్చి రొట్ట ఎరువు జీలుగలు 350 క్వింటాలు, జనుము 10 క్వింటాళ్లు కేటాయించారన్నారు. 50 శాతం సబ్సిడీపై జీలుగలు రూ.3950 క్వింటా, జనుము రూ. 4200 క్వింటాకు రైతులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. మండలంలోని రైతులందరూ ఆయా రైతు భరోసా కేంద్రాలలో పేర్లు నమోదు చేయించుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎఒ స్వప్నికా రెడ్డి

రజకులకు ప్రత్యేక రక్షణ చట్టం చేయాలి

- రజక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆల్వకొండ మద్దిలేటి

ప్రజాశక్తి - కోవెలకుంట్ల

రజకులకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలని ఎపి రజక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆల్వ కొండ మద్దిలేటి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని కంపమల్ల గ్రామంలో రజకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాలలో మురికి బట్టలను శుభ్రం చేస్తూ ప్రజలందరికీ ఆరోగ్యాన్ని, ఆనందాన్ని పంచుతున్న రజకులు మాత్రం చాలీచాలని వేతనాలతో, సాంఘికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా, రాజకీయంగా వెనకబడి కూడు, గుడ్డ, నీడ, లేక దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారని అన్నారు. శతాబ్దాలుగా కుల వివక్షకు గురవుతూ బతుకులు సాగిస్తున్నారని తెలిపారు. నేటికీ గ్రామాలలో, పట్టణాలలో శ్రమకు తగిన ప్రతిఫలం ఇవ్వమని అడిగితే రజకులపై దౌర్జన్యాలకు పాల్పడుతూ, స్త్రీలపై లైంగిక వేధింపులు, అరాచకాలు, అవమానాలు, అత్యాచారాలకు పాల్పడుతూ సాంఘిక గ్రామ బహిష్కరణలకు గురి చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు గుర్తించి రజకులకు ఒక ప్రత్యేక రక్షణ చట్టాన్ని కల్పించాలన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 ఏ ప్రకారం ఒకే దేశంలో ఒకే వృత్తిపై ఆధారపడి జీవించే వారందరికీ ఒకే రిజర్వేషన్ కల్పించాల్సింది ఉందన్నారు. అయితే భారతదేశంలో 17 రాష్ట్రాలలో, మూడు కేంద్ర పాలిత ప్రాంతాలలో రజకులు ఎస్సీ జాబితాలో కొనసాగుతూ లబ్ధి పొందుతున్నారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్లో మాత్రం రజకులు బీసీ జాబితాలో ఉంటూ అన్ని రంగాలలో వెనకబడి దుర్భర జీవితాలను గడుపుతున్నారన్నారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని, ప్రత్యేకమైన రక్షణ చట్టం కల్పించాలని, 50 సంవత్సరాల దాటిన ప్రతి రజకుడికి పింఛను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నూతన కమిటీ గౌరవ అధ్యక్షులు కంపమల్ల నరసింహులు, జిల్లా ప్రధాన కార్యదర్శి విశ్వనగర్ రాము, కోవెలకుంట్ల మండల నాయకులు చిన్న నారాయణ, మాన్యం సంఘ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎపి రజక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆల్వకొండ మద్దిలేటి



పిడిని కలిసి అభినందనలు తెలుపుతున్న నాయకులు

ఐసిడిఎస్ పిడిని కలిసిన అంగన్వాడీ, సిఐటియు నేతలు

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల జిల్లాకు నూతనంగా వచ్చిన ఐసిడిఎస్ పిడి నిర్మలను ఆమె కార్యాలయంలో గురువారం సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.యేసురత్నం, ఏ.నాగరాజు, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.షేభా రాణి, ఎం.నిర్మలమ్మలు మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే అందజేశారు. వారి వెంట అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకులు నాగరాణి, టి.సునీత, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బాల వెంకట్ తదితరులు ఉన్నారు.

ఆలయ మాన్యం భూముల కౌలుకు వేలం

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని బీరవోలు గ్రామంలో వెలిసిన వేణుగోపాలస్వామి ఆలయానికి సంబంధించిన భూములకు కౌలుకు వేలం పాటలు గురువారం నిర్వహించారు. దేవదాయ కార నిర్వహణ అధికారి వేణునాథ రెడ్డి పర్యవేక్షణ అధికారి నరసయ్య ఆధ్వర్యంలో వేలం పాటలు జరిగాయి. మొత్తం 24.79 ఎకరాల మాన్యం భూములకు గత ఏడాది రూ.3,26,000 ఆదాయం రాగా ఈ ఏడాది రూ.2,83,000 వచ్చిందన్నారు. రూ.43 వేల రూపాయలు ఆదాయం తగ్గిందన్నారు. ఈ వేలం పాటల్లో దేవాలయ మాజీ చైర్మన్ పుల్లారెడ్డి, సర్పంచి అంగ ఎలీషా, వైసిపి నాయకుడు రాజకుమార్, రైతులు పాల్గొన్నారు.

విష గుళికలు తిని మూడు బర్రెలు మృతి

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని చెరువు పల్లె గ్రామానికి చెందిన ఆవుల షేక్షావలి మూడు బర్రెలు పొలంలో విషగుళిగలు తిని మృతి చెందినట్లు నందివర్గం ఎస్సై రామాంజనేయులు గురువారం తెలిపారు. ఆవుల షేక్షావలి తన బర్రెలను పొలంలో మేపడానికి వదిలిపెట్టి ఇంటికి వెళ్లాడు. మూడు బర్రెలు తన పొలం పక్కనే ఉన్న రాజమ్మ గారి చిన్న భాష టమోటా, బీరకాయలు వేసిన పొలంలోకి వెళ్లి విష గుళికలు తినడంతో మృతి చెందాయి. వాటి విలువ సుమారు 1,30,000 రూపాయలు ఉంటుందని ఆవుల షేక్షావలి తెలిపాడు. ఫిర్యాదు మేరకు రాజమ్మ గారి చిన్న భాషపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కౌలు కార్డుల ద్వారా పథకాలు : ఎడి

ప్రజాశక్తి - కొత్తపల్లి

గ్రామాల్లో ఉన్న కౌలు రైతుల గుర్తింపు కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని ఆత్మకూరు ఏడి ఆంజనేయ తెలిపారు. గురువారం మండలంలోని శివపురం గోకవరం గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి కె మహేష్ ఆధ్వర్యంలో కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ కౌలు కార్డు(పంట సాగు ధ్రువీకరణ పత్రం) తీసుకోవడం పొందడం వలన కౌలు రైతులకు రైతు భరోసా, ఇన్పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్, సున్నా వడ్డీ రుణాలు వంటి పథకాలు ప్రభుత్వం ద్వారా వస్తాయని అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఈ కౌలు కార్డు యొక్క పరిమితి 11 నెలలు మాత్రమే ఉంటుందని తెలిపారు. దీనివలన కౌలు రైతుకు పంట మీద మాత్రమే అధికారం ఉంటుందని భూమి మీద ఎటువంటి హక్కు ఉండదని రైతులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. అలాగే రైతు భరోసా పథకం భూ యజమానికి అలాగే కౌలు రైతుకు ఇద్దరికీ వర్తిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి వెంకట నారాయణ, గ్రామ వ్యవసాయ సహాయకులు మౌనిక , గ్రామ రెవెన్యూ అధికారి బాబు మియా, ఎంపీటీసీ పి.శివన్న కో ఆప్షన్ మెంబర్ మహమ్మద్ గౌస్, గ్రామ వాలంటీర్లు, రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏడి

మహానంది: రైతులకు కౌలు కార్డుల ద్వారా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని తహసిల్దార్ జనార్దన్ శెట్టి అన్నారు. గురువారం మహానంది మండలం బుక్కాపురం, బొల్లవరం గ్రామాలలో కౌలు రైతులకు అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ జనార్దన్ శెట్టి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగేశ్వర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ వరలక్ష్మమ్మ, గ్రామ రెవెన్యూ అధికారులు క్రిస్టియానమ్మ, చలమయ్య పంచాయతీ సెక్రెటరీ సుమంత్, ఏ ఈ ఓ లు శ్రీనివాసరెడ్డి, సత్యనారాయణమ్మ, గ్రామ వ్యవసాయ సహాయకులు వసుంధర, చంద్రశేఖర్ రైతులు,వాలంటీర్లు పాల్గొన్నారు. **బేతంచర్ల:** మండలంలోని ఎం పెండకల్లు గ్రామంలో రైతులకు కౌలు కార్డులపై గురువారం అవగాహన కల్పించారు. అగ్రికల్చర్ ఆఫీసర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ కౌలుదారు పత్రాలు కౌలు రైతులకు 11 నెలల వ్యవధి వరకు పనిచేస్తాయని ఆయన తెలిపారు. కనుక ఎవరైనా అర్హత కలిగిన కౌలు రైతులు పంచాయతీ పరిధిలోని రైతు భరోసా కేంద్రంలో సంప్రదించాలని ఆయన అన్నారు.కౌలు పత్రాలు పొందడానికి ఈనెల 31 తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ జిశాన్ బాష, ఏఈఓ మధు, అహ్మద్ బాషా, ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తహసిల్దార్ జనార్దన్ శెట్టి


బేతంచర్ల: రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం


పరికరాలను పరిశీలిస్తున్న డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

డోన్ ఐటిఐలో 'కియా' ప్రత్యేక శిక్షణ

- 29న ప్రారంభించనున్న ఆర్థికమంత్రి బుగ్గన

ప్రజాశక్తి-డోన్

డోన్ ప్రభుత్వ ఐటిఐ విద్యార్థులకు ఉపయోగపడే సాంకేతిక పరికరాలను కియా కంపెనీ వారు గురువారం సరఫరా చేశారు. రాష్ట్ర ఆర్థిక మంత్రి ఆదేశాను సారం రూ. కోటి 60 లక్షల విలువ చేసే యంత్ర పరికరాలను డోన్ ఐటిఐకి సరఫరా చేసినట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. విద్యార్థులకు కియా అందించిన యంత్రపరికరాలపై శిక్షణ ఇవ్వనున్నారు. ఇక్కడ శిక్షణ పొందిన విద్యార్థులకు కియాకంపెనీతోపాటు ఇతర కంపెనీలలో కూడా ఉద్యోగావకాశాలు ఉంటాయని వారు తెలిపారు. డోన్ ఐటిఐలో ఏర్పాటు చేసే ఈ శిక్షణ కేంద్రాన్ని ఈనెల 29న ఉదయం 9 గంటలకు రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గనరాజేంద్రనాథ్‌రెడ్డి ప్రారంభించనున్నారని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, ఎంపిపి రేగటి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. పరికరాలను డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ , ఎంపిపి రేగటి రాజశేఖర్ రెడ్డి, వైస్ చైర్మన్ జాకీర్ హుస్సేన్, డోన్ నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ దినేష్ గౌడ్, కౌన్సిలర్లు దారా హరి, ఆర్ట్ రమణ, వైసిపి నాయకులు రఘురామయ్య, రైల్వే నాయుడు, మినిస్టర్ పిఎస్‌లు ఉమామహేశ్వర్ రెడ్డి, రమేష్ రెడ్డి, కియా పరిశ్రమ సభ్యులు, ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ తదితరులు పరిశీలించారు.


నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే గంగుల

వైసిపి నాయకుడి మృతికి సంతాపం

ప్రజాశక్తి - చాగలమర్రి

మండలం లోని శెట్టివీడు గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు రామనారాయణరెడ్డి (45) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి గురువారం శెట్టివీడు చేరుకొని మృతదేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కార్యక్రమం లో వైసిపి రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి బాబులాల్, ఎంపిపి వీరభద్రుడు, వైస్ ఎంపీపీ రషీ, జిల్లా సేవాదల్ అధ్యక్షుడు గణేష్ రెడ్డి,వైసిపి నాయకులు వెంకట రమణ, భాస్కర్ బాషా,ఎంపిటిసి పత్తినారాయణ,మనోహర్ రెడ్డి,జివన్ మహబూబ్‌బాషా, లక్ష్మీనారాయణ రెడ్డి, హనుమంతరెడ్డి, ప్రసాదరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చెంచు గిరిజనులకు ఇళ్లు నిర్మించాలి

ప్రజాశక్తి - శ్రీశైలం

చెంచు గిరిజనులకు ఇళ్ల స్థలాలు కేటాయించి ఇళ్ల నిర్మాణం చేపట్టాలని ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు వై ఆశీర్వాదం ప్రభుత్వాని కోరారు. గురువారం శ్రీశైలం ప్రాజెక్టు కాలనీ స్థానిక ఐఎఫ్‌టియు కార్యాలయంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వై ఆశీర్వాదం మాట్లాడుతూ 40 సంవత్సరాల కిందట గిరిజనులకు ఇళ్ల శిథిలావస్థకు చేరుకున్నామని, ఇప్పటికి చెంచులు గత్యంతరం లేక పడిపోయిన ఇళ్లల్లోనే గిరిజనులు నివాసం ఉంటున్నారన్నారు. తక్షణమే ప్రభుత్వం పాత ఇల్లు మరమ్మతులు చేయించి, ఇళ్లు లేని చెంచు కుటుంబాలు అందరికీ ఇళ్ల స్థలం కేటాయించి ఇళ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. యువతకి, యువకులకు ఉద్యోగ, ఉపాధి కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కొమరం భీమ్ ఆదివాసి చెంచు గిరిజన సంఘం నాయకులు కుడుముల వెంకటేశ్వర్లు, గంగయ్య, వీరయ్య, బయన్న, ఐఎఫ్‌టియు నాయకులు వై శీను, ఏ జెహార్, తదితరులు పాల్గొన్నారు.


పైప్‌లైన్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న దృశ్యం

పైపులైన్ నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి - నందికొట్కూరు

నందికొట్కూరు పట్టణంలో మద్దిగట్ల రోడ్డు నందు పాడైపోయిన పైపులైన్ స్థానంలో నూతన పైపులైన్ నిర్మాణానికి మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, వైస్ చైర్మన్ అర్షా పోగు ప్రశాంతి గురువారం భూమిపూజ చేశారు. ఎస్‌డిపి నిధుల ఈ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బొల్లెద్దుల రామకృష్ణ, వెంకటేశ్వర రెడ్డి, ఏకు భాను ప్రతాప్, రామిరెడ్డి, చాంద్ బాష పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - సంజామల

మండలంలోని అలువకొండ గ్రామానికి చెందిన హజరత్ (55) బొలెరో వాహనం ఢీకొట్టడంతో మృతి చెందినట్లు ఎస్సై ప్రతాప్ గురువారం తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. హజరత్ మోటార్ సైకిల్‌పై వెళుతుండగా బొలెరో వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందారు. హజరత్‌కు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నిరుపేద దళితులకు భూములు ఇవ్వాలి : ఎంఆర్‌పిఎస్

ప్రజాశక్తి - బేతంచెర్ల

భూమిలేని నిరుపేదలైన దళితులకు రాష్ట్ర ప్రభుత్వం భూములు కేటాయించాలని ఎమ్మార్పీఎస్ బేతంచెర్ల మండల కమిటీ నత్తి సత్యం మాదిగ, జై మద్దిలేటి మాదిగ, ఎస్ మాధవస్వామి మాదిగ, రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నాడు ఎంఆర్‌పిఎస్ నాయకులు తహశీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. మండలంలోని దళిత నిరుపేద కుటుంబాలకు కనీసం ఒక ఎకరా చొప్పున భూమిని కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ డోన్ అధ్యక్షులు నత్తి సత్యం మాదిగ, బేతంచర్ల మండల గౌరవ అధ్యక్షులు జై మద్దిలేటి మాదిగ, మండల అధ్యక్షులు ఎస్ మాధవస్వామి మాదిగ, తదితరులు పాల్గొన్నారు.


వినతి పత్రం ఇస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

వెంకటయ్య ఆశయ సాధనకు కృషి : సిఐటియు

ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచర్ల మండలం లారీ మోటర్ వర్కర్స్ యూనియన్ వ్యవస్థా పకులు పి వెంకటయ్య ఆశయ సాధనకు కృషి చేయాలని సిఐటియు మండల కార్యదర్శి వై ఎల్లయ్య, లారీ మోటార్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వైబి వెంకటేశ్వర్లు అన్నారు. పి వెంకటయ్య 25వ వర్ధంతి సందర్భంగా బేతంచెర్ల లారీ మోటర్ వర్కర్స్ యూనియన్ ఆఫీస్ నందు సిఐటియు మండల కమిటీ నాయకులు బి రామాంజనేయులు అధ్యక్షతన వెంకటయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం బలపాలపల్లి రోడ్డు డ్రైవర్స్ కాలనీ నందుగల వెంకటయ్య సమాధి వద్దకు సిఐటియు అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు వెళ్లి సమాధి వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు వైబి వెంకటేశ్వర్లు, వై ఎల్లయ్య మాట్లాడారు. ఆర్మీలో ఉద్యోగ పదవీ విరమణ పొందిన తర్వాత పి వెంకటయ్య బేతంచర్లలో డ్రైవర్లు పడుతున్న ఇబ్బందులను చూసి చలించిపోయి డ్రైవర్లకు యూనియన్ యూనియన్ స్థాపించడం జరిగిందన్నారు. అప్పట్లో డ్రైవర్లు యూనియన్ స్థాపించడం సహించలేని స్థానిక భూస్వాములు లారీ మోటర్ వర్కర్స్ యూనియన్ పై బాంబు దాడి చేసి ఆఫీసును ధ్వంసం చేసిన సిఐటియు అండదండలతో లారీ డ్రైవర్లు మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగి ఎన్నో వ్యాయా ప్రయాసలకు ఓర్చి దాదాపు 20 మంది లారీ డ్రైవర్లు సొంత ఊరైన బేతంచర్లను వదిలి దాదాపు రెండు సంవత్సరాలు అజ్ఞాతవాసం చేసి బేతంచర్లలో లారీ వర్కర్స్ యూనియన్ నెలకొల్పడం జరిగిందన్నారు. 1979లో 40 మందితో ప్రారంభమైన లారీ వర్కర్స్ యూనియన్ ఈనాడు సిఐటియు అనుబంధంతో మరియు వ్యవసాయ కార్మిక సంఘం రైతు సంఘం ఆధ్వర్యంలో బేతంచర్ల మండలంలో పదివేల మంది కార్మికుల సభ్యత్వంతో సంఘాలను ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో లారీ వర్కర్స్ యూనియన్ కార్మికులు మద్దిలేటి స్వామి, నాగేష్, ఎస్‌పి కలాం, జలంధర్, స్వామి నాయుడు, వేణుగోపాల్ ,రాజు, దస్తగిరి, ఆశిన్ బాష, రామచంద్రుడు, గనీ బాష, నారాయణ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



వెంకటనరసయ్య చిత్ర పటానికి నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

సిపిఎస్‌ను రద్దుచేయాలి

ప్రజాశక్తి - నందికొట్కూరు

సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని ఎపి ఉద్యోగుల సంఘం నేతలు డిమాండ్ చేశారు. ఈనెల 22వ తేది నుండి అక్టోబరు 31 వరకు దశల వారి ఆందోళన చేపట్టాలని రాష్ట్ర సంఘం సమావేశంలో తీసుకొన్న తీర్మానం మేరకు నందికొట్కూరు స్థానిక పొట్టి శ్రీరాములు కూడలిలో సుమారు 150 మందితో రిలే నిరాహార దీక్షలను చేపట్టారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘం నేతలు మాట్లాడుతూ ప్రభుత్వం ఇకనైనా తమ సంఘ ఆందోళనలకు స్పందించి, సంఘం ప్రభుత్వానికి సమర్పించిన 200 డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని కోరారు. లేనియెడల ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఉదయం 10.00 గంటలకే ఉద్యోగులు ఆందోళన శిబిరానికి చేరుకొని, వారి శాఖాపరమైన సమస్యల పై పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అధిక సంఖ్యలో మహిళా ఉద్యోగులు పాల్గొని ప్లకార్డులు ప్రదర్శించారు. నిరాహార దీక్షలో పాల్గొన్న వారికి జిల్లా అధ్యక్షులు యం.సి.నరసింహులు, కార్యదర్శి కె. నాగేంద్రప్ప జిల్లా సహా అధ్యక్షులు గిరి శంకర్ రెడ్డి, జిల్లా కోశాధికారి యం.శ్రీనివాస రావు, బి.సునిల్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింప చేశారు. ఈ కార్యక్రమములో నందికొట్కూరు తాలూకా అధ్యక్షులు కె.బాల రాజు, తాలూకా కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, సహా అధ్యక్షులు నరస రాజు వైస్ ప్రెసిడెంట్ రాముడు, కోశాధి కారి శంకర్ గౌడ్, ఇతర అనుబంధ సంఘా లు, ప్రజా రవాణా శాఖ నాయకులు డి.వై.స్వామి, పెన్షనర్స్ సంఘం వైస్ ప్రెసిడెంట్ బి.రాజశేఖర్‌రెడ్డి, ఖాజామోహినుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.


దీక్షలను విరమించిన ఉద్యోగ సంఘం నాయకులు

నగర పంచాయతీ అన్ని విధాలుగా అభివృద్ధి : సిహెచ్ చలం రెడ్డి

ప్రజాశక్తి - బేతంచర్ల

బేతంచెర్ల నగర పంచాయతీని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడం జరుగుతోందని నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్ చలం రెడ్డి, నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబులు అన్నారు. బేతంచర్ల నగర పంచాయతీ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం గురువారం నాడు చలం రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సర్వసభ్య సమావేశంలో సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర నాయక్ అజెండాను చదివి వినిపించారు. ఈ సందర్భంగా చైర్మన్ చలం రెడ్డి, కమిషనర్ రమేష్ బాబు మాట్లాడుతూ బేతంచెర్ల పట్టణంలో కందకం దగ్గర చర్చి వెనుక 100 మీటర్ల వరకు ఒక అడుగు కాలువ నిర్మించుటకు, వడ్డేపేటలోని సుంకులమ్మ గుడి దగ్గర పాత పబ్లిక్ టాయిలెట్లు పడగొట్టి కొత్తగా నిర్మించుటకు 15 లక్షల రూపాయల అంచనా తదితర అంశాలపై చర్చించారు. కందకం దగ్గర గల పెద్ద కబేలా మార్కెట్ సమీపంలో దుర్గంధమైన వాసన, తదితర విషయంలో కోఆప్షన్స్ సునీల్ ప్రవేశపెట్టిన అంశాలను సమస్యను పరిష్కరిస్తామని అధికారులు అన్నారు. తాగునీరు, డ్రైనేజీ, సిసి రోడ్లు మరుగుదొడ్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. కుక్కలకు వ్యాక్సినేషన్ వేపించి దూర ప్రాంతాలకు తరలించడం జరిగిందని, కొందరు కుక్కలు తరలింపై నోటీసులు పంపడం వల్ల ప్రస్తుతానికి కుక్కలు పట్టడం నిలిపివేయడం జరిగిందన్నారు. కందకం దగ్గర పార్కు ఏర్పాటు చేయడం జరుగుతుందని, జంగాల పేట నుండి బనగానపల్లె రోడ్డు వరకు సిసి రోడ్లు వేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలోమెప్మా అధికారి శ్రీదేవి, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర నాయక్ జూనియర్ అసిస్టెంట్ మల్లికార్జున, శానిటైజర్ రాజేష్, వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ మధు, రామ్ గోపాల్, కౌన్సిలర్ నాగజ్యోతి, హుస్సేన్బీ, ముబీనా, ఆంజనేయులు, సునీల్, కోట్ల మధు ,తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ సిహెచ్ చలం రెడ్డి

వేలంపాటల్లో పెరిగిన ఆదాయం

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

మండలంలోని పార్నపల్లి గ్రామంలో మాన్యం భూములకు నిర్వహించిన వేలం పాటల్లో గతేడాది కంటే ఆదాయం పెరిగింది. గ్రామంలోని ఆంజనేయస్వామి, వేణుగోపాల స్వామి, వీరభద్ర స్వామి, కౌలుట్ల లక్ష్మయ్య, సుబ్బమ్మ అన్నదాన సత్రం వారి భూమి ఓంకార సిద్దేశ్వర స్వామి భూమి 95 ఎకరాల భూమిని ఒక సంవత్సరానికి గురువారం ఆంజనేయ స్వామి దేవాలయంలో చైర్మన్లు దే రెడ్డి జనార్దన్ రెడ్డి, మల్లు మంజులా దేవి, ఈవో నాగప్రసాద్ ఆధ్వర్యంలో బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. 95 ఎకరాలకు గాను రూ.19.81 లక్షలు ఆదాయం వచ్చిందని, గత సంవత్సరం వేలం పాటలు నిర్వహించగా రూ.16.87 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈవో నాగప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్నపల్లె గ్రామ సర్పంచ్ షేక్ షబ్బీర్ అహ్మద్, లక్ష్మి కాంత్ రెడ్డి, మాజీ సర్పంచ్ మరల పెద్ద సుబ్బారెడ్డి, నర్ల రాఘవరెడ్డి, బుల్లెట్ రాఘవరెడ్డి, కాజీపేట మురళీ మోహన్ రెడ్డి, పిక్కిలి వెంకట రామకృష్ణుడు, నర్ల వెంకటరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


దేవాలయ భూములు వేలం పాటలు పాడుతున్న దృశ్యం

నూతన ఎస్ఐలు బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - అవుకు

అవుకు ఎస్సైగా ఎస్ నరేంద్ర గురువారం బాధ్యతలు చేపట్టారు. ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి బదిలీపై వెళ్లడంతో కర్నూలు జిల్లా గూడూరు పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న ఎస్ నరేంద్రను అవుకు పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేయడంతో ఆయన ఎస్. నరేంద్ర బాధ్యతలను స్వీకరించారు.


అవుకు ఎస్సై ఎస్ నరేంద్ర

కొత్తపల్లి ఇన్చార్జి ఎస్ఐగా హుస్సేన్ బాష

కొత్తపల్లి : కొత్తపల్లి ఇన్చార్జి ఎస్ఐగా హుస్సేన్ బాష కొత్తపల్లి పోలీస్ స్టేషన్లో గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్సై ముబీనా తాజ్ అన్నమయ్య జిల్లాలో రిపోర్ట్ తీసుకోవాలని అధికారులు పేర్కొన్నారు. ఈయన ప్రస్తుతం ఆత్మకూర్ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్నారు. కొత్తపల్లి స్టేషన్లో బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడుతూ అల్లర్లు చేస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. మండల ప్రజలకు తాను అందుబాటులో ఉంటానని తెలిపారు.



నంద్యాల క్రీడాకారులకు రాష్ట్రస్థాయి పతకాలు

ప్రజాశక్తి - నంద్యాల

ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెనాలిలో ఈనెల 21, 22వ తేదీలలో జరిగిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ క్లాసిక్ ఛాంపియన్ షిప్ పోటీలలో నంద్యాలకు చెందిన క్రీడాకారులు ఐదు మంది పతకాలు సాధించారు. ఈ సందర్భంగా నంద్యాల క్రీడా సమాఖ్య కార్యాలయంలో, నంద్యాల లయన్స్ క్లబ్ సహకారంతో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జి.రవికృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని క్రీడాకారులను జ్ఞాపికలతో సత్కరించి అభినందించారు. రామకృష్ణ డిగ్రీ కళాశాలకు చెందిన క్రీడాకారులు పల్లవి 43 కేజీల కేటగిరిలో బెంచ్ ప్రెస్‌లో బంగారు పతకం, పవర్ లిఫ్టింగ్‌లో కాంస్య పతకం, లక్ష్మీ నరసింహ 53 కేజీల విభాగంలో బెంచ్ ప్రెస్‌లో బంగారు పతకం, మహేష్ బాబు బెంచ్ ప్రెస్‌లో రజత పతకం, 83 కేజీల జూనియర్ విభాగంలో రోహిత్ వర్మ బెంచ్ ప్రెస్‌లో రజత పతకం, పవర్ లిఫ్టింగ్‌లో కాంస్య పతకం సాధించారు. నేషనల్ డిగ్రీ కళాశాలకు చెందిన రాజు 83 కేజీల జూనియర్ విభాగంలో బెంచ్ ప్రెస్‌లో బంగారు పతకం అందుకున్నాడు. రాష్ట్రస్థాయి పతకాలు అందుకున్న ఈ క్రీడాకారులు అక్టోబర్ లో హిమాచల్‌ప్రదేశ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలలో రాష్ట్రం తరపున పాల్గొన నున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ నంద్యాలలో క్రీడాకారులు ఉన్నత స్థాయి విజయాలు సాధించడానికి వారికి అవసరమైన క్రీడా పరికరాలు సమకూర్చడానికి స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు చంద్రమోహన్, కార్యదర్శి కూరా ప్రసాద్, కోశాధికారి రత్నకుమార్ పాల్గొన్నారు.


క్రీడాకారులను అభినందించిన ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు రవి కృష్ణ

జలజాగరణ దీక్షను విజయవంతం చేద్దాం

ప్రజాశక్తి - నంద్యాల

సిద్దేశ్వరం జలజాగరణ దీక్షను విజయవంతం చేద్దాం అని రాయలసీమ సాగునీటి సాధన సమితి ఉపాధ్యక్షులు వై.యన్.రెడ్డి పేర్కొన్నారు. గురువారం నంద్యాల మండలం బిల్లలాపురం, కొత్తపల్లి, మునగాల, పులిమద్ది, భీమవరం గ్రామాలలో జలజా గరణ దీక్ష సందర్భంగా ప్రచార కార్యక్రమాలను నిర్వహించి గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగునీటి ప్రాజెక్టులపై ప్రజలలో సరియైన అవగాహన లేకపోవడం, ఐక్యమత్యం లేకపోవడంతోనే మనం నీటి ప్రాజెక్టులను సాధించుకోలేకపోయామని అన్నారు. సిద్దేశ్వరం అలుగును నిర్మిస్తే రాయలసీమలో తాగు, సాగునీరుకు ఇబ్బందులు ఉండవని, పారిశ్రామికంగా నూ అభివృద్ధి చెందుతు oదని అన్నారు. ఈ కార్యక్ర మాలలో భాస్కర్ రెడ్డి,పులిమద్ది సర్పంచ్ రఘు రామిరెడ్డి, మునగాల మాజీ సర్పంచ్ రామ చంద్రారెడ్డి, బిల్లలాపురం రామకృష్ణారెడ్డి, కొత్తపల్లె లక్ష్మిరెడ్డి, మహేశ్వరరెడ్డి, భీమవరం రామచంద్రారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులు వేగవంతం

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని ఆయా పాఠశాలల్లో జరుగుతు న్న నాడు-నేడు పనులను వేగవంతం చేయాలని ఇన్‌ఛార్జి ఎంఇఒ కోటయ్య హెచ్‌ఎంలకు సూచించా రు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో మండలంలోని ఆయా పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులపై హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే పాఠశాలలు ప్రారంభం కానున్నాయని, పనులు మాత్రం ముందుకు సాగడం లేదన్నారు. తాగునీరు, కిచెన్ షెడ్డు పూర్తి చేయాలన్నారు. సమస్యలు ఉన్నప్పటికీ వాటిని పరిష్కరించుకోవాలన్నారు. సమావేశంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి ఎంఇఒ

ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి ముప్పు

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి ముప్పు అని బండి ఆత్మకూరు రేంజర్ నాసిర్ ఘాతుకం, ఎస్ఎస్ఓ రవీంద్ర నాయక్, వెంకటసుబ్బయ్య తెలిపారు. లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్మెంటల్ అనే ప్రోగ్రాం కింద అటవీశాఖ ఆధ్వర్యంలో మండలంలోని ఏ కోడూరు, జిసి పాలెం, సంత జుట్టు, గడివేముల మండలంలోని కరిమిదల గ్రామాల్లో ప్రజలకు పర్యావరణం రక్షణ పట్ల అవగాహన కల్పించారు. జీవన విధానంలో ప్లాస్టిక్ వినియోగం క్రమేపి తగ్గించుకోవాలని కోరారు. ప్లాస్టిక్ వల్ల భూసారం తగ్గి పర్యావరణ కాలుష్యం పెరిగి మానవ జీవన ప్రమాణాలు పడిపోతాయని తెలిపారు. వాతావరణ సమతుల్యంతో జీవన విధానం ముడిపడి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌బిఓలు వెంకటరమణ, రామకృష్ణ, హైమావతి, మదర్సా ప్రొటెక్షన్ వాచర్లు, తదితరులు పాల్గొన్నారు.


ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న ఎఫ్ ఎస్ ఓ రవీంద్ర నాయక్

గృహ నిర్మాణాలు ప్రారంభించకుంటే పట్టా రద్దు

- తహశీల్దారు విజయ్ కుమార్

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రి పట్టణంలోని జగనన్న లే అవుట్లలో ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో గృహ నిర్మాణం చేపట్టకపోతే పట్టా రద్దు చేస్తామని తహశీల్దారు విజయ్ కుమార్ హెచ్చరించారు. గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ జగనన్న లే అవుట్లలో స్థలం పొందిన ప్రతి ఒక్కరూ గృహ నిర్మాణం చేయాలని స్పష్టం చేశారు. జగనన్న లే అవుట్లలో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నెల చివరి నాటికి నిర్మాణ పనులు ప్రారంభించకుంటే పట్టాను రద్దు చేసి 90 రోజుల అర్హులకు పంపిణి చేస్తామన్నారు. లే అవుట్లలో అన్ని మౌళిక వసతులు కల్పించామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న లబ్ధితో పాటు స్వయం సహాయక సంఘాల నుంచి రూ.30 వేల వరకు రుణం తీసుకుని నిర్మాణాన్ని పూర్తి చేసుకోవాలని సూచించారు.


మాట్లాడుతున్న తహశీల్దారు

ముగిసిన విగ్రహ ప్రతిష్ట వేడుకలు

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని ఆర్.కొత్తూరు గ్రామంలో శ్రీ పట్టాభి రామస్వామి నూతన ఆలయ విగ్రహ ప్రతిష్ట వేడుకలు గురువారం ముగిశాయి. రుద్రవరం గ్రామానికి చెందిన వారణాసి గోపి శర్మ ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గుండు పందెములు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు ఆలయ నిర్వాహకులు బహుమతులు అందజేశారు. విగ్రహ ప్రతిష్ట వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.


క్రేన్ సహాయంతో విగ్రహ ప్రతిష్ట చేస్తున్న